
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 19 అక్టోబరు 2025



కలెక్టరు సైకిల్ సవారీ !

- వాహన కాలుష్య నివారణకు వినూత్న ప్రయత్నం
- నాణ్యమైన గాలి కావాలంటే మొక్కలు నాటాలి : హిమాన్షు శుక్లా



నెల్లూరు(సిటీ),అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): కలెక్టరేట్ దాటితే ఎక్కడికైనా కారులోనే వెళ్లే కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం సైకిలెక్కారు. ఎక్కడమే కాదండోయ్... నెల్లూరు నగరంలోని బట్వాడీపాళెం నుంచి సారాయి అంగడి సెంటర్ వరకు సైకిలు తొక్కుకుంటూ వెళ్లారు. మాటలు చెప్పడం కాదు... వాటిని ఆచరించి చూపించారాయన. ఇంతకు విషయం ఏమిటంటే.. ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన సైకిలెక్కారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహన కాలుష్యాన్ని నివారించేందుకు సైకిలే ప్రత్యామ్నాయమన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో మొక్కలు నాటారు. అక్కడ మాట్లాడుతూ ఈసారి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో క్లీన్ ఎయిర్ థీమ్ తీసుకున్నామన్నారు. పర్యావరణం బాగుంటేనే నాణ్యమైన గాలి అందుబాటులో ఉంటుందని, ఇందుకోసం మొక్కలను పెంచడమే మార్గమని తెలిపారు. మంచి వర్షాలు పడుతున్నందున అందరూ విధిగా ఒక మొక్కను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డీడీ మాధురి, డీసీ చెన్నుడు, ఎంహెచ్‌వో డాక్టర్ కనకాద్రి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో స్వచ్ఛాంధ్ర

నెల్లూరు(క్రైం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసు స్టేషన్ల లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శుభ్రమైన గాలి అనే అంశంపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, హోంగార్డు ఆర్ఐ పాల్‌రాజ్, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ సౌజన్య

వెలుగులు నింపేనా..?

- నగరంలోని ఆరుచోట్ల బాణసంచా దుకాణాల ఏర్పాటు
- టపాసుల అంగళ్ల ఏర్పాటులో జాప్యం
- కురుస్తున్న భారీ వర్షాలు
- వ్యాపారుల్లో భయం... భయం
- గోదాములు, తయారీ కేంద్రాల్లో రక్షణ చర్యలు తీసుకునేనా...?



నెల్లూరు : వీఆర్సీ మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

నెల్లూరు(క్రైం) అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): కులమతాలకు అతీతంగా, చిన్నా పెద్దా తారతమ్యాలు లేకుండా జరుపుకునే పండుగ దీపావళి. ఇంటిల్లిపాది కలిసి సంతోషంగా జరుపుకోవాలని అందరూ కోరుకుంటారు. మరి ఈ ఏడాది దీపావళి జిల్లా ప్రజలందరిలోనూ కాంతులను నింపుతుందా..? లేక ప్రమాదాలను తీసుకువస్తుందా..? అనేది వేచిచూడాలి. జిల్లాలో పర్మినెంట్ లైసెన్సులు కలిగిన దుకాణాలు 32 ఉండగా, 320కిపైగా షాపులకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేశారు. నగరంలోని ఆరు ప్రాంతాల్లో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాలకు అనుమతులు ఇవ్వడం ఈ ఏడాది ఆలస్యం కావడం, భారీ వర్షాలు కురుస్తుండడంలో వ్యాపారులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

● మరువలేని పొర్లుకట్ట ఘటన

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే టపాసుల తయారీకి అధికారులు అనుమతులు ఇచ్చారు. గతంలో అనుమతులు ఇవ్వమని తెలిపినా, బాణసంచా తయారు చేసుకునే వారి జీవనాధారాన్ని దృష్టిలో పెట్టుకుని పర్మిషన్లు రెన్యూవల్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, ఆత్మకూరు, వింజమూరు,నగరంలోని పొర్లుకట్ట ప్రాంతాల్లో మాత్రమే టపాసుల తయారీకి అనుమతులు ఉన్నాయి. అవి కూడా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటూ కేటాయించిన ప్రాంతాల్లోనే టపాసుల తయారీ చేయాల్సి ఉంది. తయారీ కేంద్రాల్లోనూ అనుమతి పొందిన ప్రకారం నల్లమందుతో మాత్రమే బాణసంచా తయారు చేయాల్సి ఉంది. అయితే నిబంధనలు ఏ మాత్రం పాటించకుండా అధిక మొత్తంలో నల్లమందును తయారీ కేంద్రాల్లో ఉంచి టపాసులు తయారు చేస్తున్నారు. గతంలో పొర్లుకట్ట ప్రాంతంలో జరిగిన ప్రమాదాన్ని జిల్లా ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు.

పొర్లుకట్ట ప్రాంతంలో టపాసులు తయారు చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో పలువురు మృత్యువాత పడ్డారు. ఇలాంటి ప్రమాదాలు పునారవృత్తం కాకుండా నిబంధనలకు కచ్చితంగా పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

అనుమతులకు మించి నిల్వలు

జిల్లావ్యాప్తంగా టపాసులు గోదాములు, తయారీ కేంద్రాలు 38 ఉన్నాయి. గోదాముల్లో అనుమతులు ఇచ్చిన ప్రకారమే సరుకు నిల్వ చేసుకోవాలి. 10 నుంచి 1500 కేజీల వరకు నిల్వ కోసం అధికారులు గోదాములకు, దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. అయితే నిబంధనలను అతిక్రమిస్తూ వేలాది కేజీల సరుకును గోదాముల్లో వ్యాపారులు నిల్వ ఉంచి, అమ్మకాలు చేస్తున్నారు. వీటి వద్ద కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

తెలుగు గంగ ప్రాజెక్టు

స్పెషల్ కలెక్టర్‌గా మౌర్య



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు (ఎఫ్‌ఏసీ) స్పెషల్ కలెక్టర్‌గా మౌర్యను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మౌర్య తిరుపతి జిల్లా జేసీగా పని చేస్తున్నారు.. తెలుగుగంగ ప్రాజెక్టుకు స్పెషల్ కలెక్టర్(ఎఫ్ఏసీ)గా కూడా వ్యవహరించనున్నారు.

రైతుబజారు పనులకు మెలిక

8

● ఎమ్మెల్యే ఒత్తిడితో ఎట్టకేలకు ప్రారంభం

కోటంరెడ్డి, పట్టాభికి క్లాస్

- ప్రెస్‌మీట్లపై రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం
- ఇకపై ఇలా జరిగితే ఊరుకునేది లేదు..
- ఇద్దరు నేతలకు పల్లా శ్రీనివాసరావు హెచ్చరిక
- విలేకరులతో మాట్లాడాలంటే జిల్లా అధ్యక్షుడి అనుమతి తప్పనిసరి





నెల్లూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన ఆరోపణలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శనివారం నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అమరావతికి పిలిపించి, జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ సమక్షంలో గట్టిగా హెచ్చరించారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, టీడీపీ నాయకులే మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తున్నారని కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విలేకరుల సమావేశంలో తీవ్రంగా ధ్వజమెత్తారు. అంతేకాక సివిల్ సప్లయ్స్‌శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును కూడా ప్రస్తావించడంతో కూటమిలో దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై శనివారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అమరావతిలో వారిద్దరిని సంజాయిషీ కోరారు. అసలు ప్రెస్‌మీట్ పెట్టడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు.. అని కోటంరెడ్డిని పల్లా ప్రశ్నించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కూర్చుని ఇష్టం వచ్చినట్టుగా మీడియాతో మాట్లాడటానికి ఇంగితం లేదా... అని ఘాటుగా పల్లా విరుచుకుపడినట్లు సమాచారం. ఇకపై ప్రెస్‌మీట్ పెట్టాలంటే జిల్లా పార్టీ అధ్యక్షుడి అనుమతి తీసుకోవాలి... ఆయనకు కంటెంట్‌ను వివరించాలి.. అందుకు ఆయన అంగీకరిస్తే తప్ప ప్రెస్‌మీట్ పెట్టడానికి వీలులేదు.. అని కోటంరెడ్డి, పట్టాభిలను ఆదేశించారు. మీ ఇద్దరి వ్యక్తిగత కక్షలను పార్టీపై రుద్దాలని చూస్తే సహించేది లేదని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని పల్లా వారిని హెచ్చరించి పంపినట్లు తెలిసింది.కూటమి నేతలను పదిలంగా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పల్లా గుర్తు చేశారు.

సోమశిలకు 15,064 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 15,064 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 73.837 టీఎం సీల నీరు నిల్వ ఉందని, పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇక, కండలేరు జలాశయం నీటి సామర్థ్యం 68టీఎంసీలు కాగా, ప్రస్తుత డ్యాం నీటిమట్టం 60టీఎంసీలకు చేరిందని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3060 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, 3000 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

శంభో... శివ శంభో!

భక్తిశ్రద్ధలతో శని మహా త్రయోదశి



నెల్లూరు : చిన్న నందివాహనంపై మూలస్థానేశ్వరుడు, భువనేశ్వరిదేవి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవక్షేత్రాల్లో శనివారం శని మహాత్రయోదశి పూజలు జరిగాయి. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పాలభిషేకాలు నిర్వహించారు. శని మహాదేవుడికి తైలాభిషేకాలు పూజలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల పూజలు చేశారు. నందీశ్వరునికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, అలంకారాలు జరిగాయి. అనంతరం శివుడికి అభిషేకాలు, పాలభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. నగరంలో ప్రదోషకాల పూజలు, మూలస్థానేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, రాజరాజేశ్వరి ఆలయం, నవాబుపేట మల్లికార్జునస్వామి ఆలయం, ఉస్మాన్ సాహెబ్‌పేట, భక్తవత్సలనగర్, పడారుపల్లి శివాలయాల్లో ఘనంగా జరిగాయి. భక్తుల శివనామ స్మరణలతో ఆలయాలు మారు మోగిపోయాయి.

● ఘనంగా ధన త్రయోదశి

నగరంలోని బంగారు దుకాణాల్లో ధన త్రయోదశి పూజలు నిర్వహించారు. కార్పొరేట్ బంగారు దుకాణాలు, బంగారం, వెండి, డైమండ్స్ అమ్మకాలపై బంపర్ ఆఫర్లు ప్రకటించాయి. దీంతో బంగారం కొనుగోలుదారులతో కార్పొరేట్ బంగారు దుకాణాలు కళకళలాడాయి.

● వైభవంగా చిన్నవెండి నందిసేవ

మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో శనివారం రాత్రి శని మహాత్రయోదశి, ప్రదోషకాల పూజలు సందర్భంగా చిన్న వెండినంది వాహనంపై మూలస్థానేశ్వర స్వామికి, భువనేశ్వరి అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం జరిగింది. సాయంత్రం నందీశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకారం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆర్‌వీ శ్రీనివాసులురెడ్డి, అర్చక స్వాములు, సిబ్బంది పర్యవేక్షించారు.

నిత్యావసర సరుకులపై

రూ.2 వేల వరకు ఆదా

- జీఎస్టీ వెసులుబాటుతో ప్రజలకు భారీ ఊరట
- ఆత్మకూరు అవగాహన ర్యాలీలో మంత్రి ఆనం

ఆత్మకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన జీఎస్టీ వెసులుబాటు వల్ల తగ్గిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట లభించిందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆత్మకూరులో జీఎస్టీ సంస్కరణ వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన భారీ ర్యాలీని ఆయన ప్రాంభించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో అన్నీ వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. ప్రతీ కుటుంబానికి నెలకు సుమారు రూ.2వేల వరకు ఆదా అవుతందని వివరించారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే నిత్యావసర సరుకులు, బ్రష్‌లు, సబ్బులు, కొబ్బరినూనె తదితర సామగ్రిపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో ధరలు బాగా తగ్గాయని పేర్కొన్నారు. డయాబెటిక్ మందులపై జీఎస్టీని పూర్తిగా తొలిగించినట్లు వివరించారు. రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, వాటి విడి భాగాలపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడంతోపాటు ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు తదితరాలపై జీఎస్టీ బాగా తగ్గించడంతో ప్రతీ ఒక్కరికి అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రధానంగా రవాణా రంగంలో జీఎస్టీ సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నట్లు మంత్రి వివరించారు.దీంతో స్కూటర్లు, బైకులు, కార్ల ధరలు బాగా తగ్గినట్లు తెలిపారు. అనంతరం జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్ జీఎస్టీ ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ముందుగా ఆత్మకూరులోని ట్రాక్టర్, స్కూటర్ షోరూమ్‌లను మంత్రి ఆనం సందర్శించారు.



జీఎస్టీ అవగాహన ర్యాలీలో మంత్రి ఆనం, డీటీసీ చందర్, నాయకులు, అధికారులు

● ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి ఆనం తెలిపారు. నియోజకవర్గంలోని 111 మంది బాధిత కుటుంబాల లబ్ధిదారులకు రూ. 88.50 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 125 మంది కార్మికులకు రెండు జతల దుస్తులు, సామగ్రికిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ. పావని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జీ. వెంకటరమణమ్మ, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

జోరు వాన

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- నగరంలో రోడ్లన్నీ జలమయం



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శనివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం పడింది. ఈ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలోని మూడు హాళ్ల సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, ఏకే నగర్ ప్రాంతాల్లో రోడ్లపై మురుగునీరు చేరింది. కాలువల్లో చెత్తాచెదారాలను తొలగించక పోవటంతో మురుగునీరు రోడ్లపై పారింది. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి జిల్లాలో మూడురోజులుగా వర్షం పడుతోంది. కురుస్తున్న వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. కాగా జిల్లాలో సగటు వర్షపాతం 6.2 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కొండాపురంలో 32.2 మి.మీ, అత్యల్పంగా కొడవలూరులో 2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● బోగోలులో ఎడతెరిపి లేకుండా...

బిట్రగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కొంతసేపు ఎండ.. అంతలోనే వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల దెబ్బతిన్న డ్రైనేజీ కాలువల్లోని మురికినీరు రోడ్లపై ప్రవహిస్తు దుర్గంధం వెదజల్లుతోంది.

● చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

జలదంకి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకే అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ అంతా వర్షపునీటితో నిండి చెరువును తలపిస్తోంది. గత మూడు రోజులుగా మండలంలో వర్షం కురుస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నీరు నిల్వ చేరకుండా చదును చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రచ్చబండా..! డోంట్‌కేర్.. 'మందే'సెయ్..!

● ఇటు సచివాలయం.. అటు అంగన్‌వాడీ.. 'మద్య'(ం) బార్!


రచ్చబండపైనే మద్యం సేవిస్తున్న యువకులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మందు బాబులం.. మేం.. మందు బాబులం! మందు కొడితే మాకు మేమే మహారాజులం' అంటున్నారు.. 'కిక్కెక్కిన' కొందరు యువకులు. 'బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం' కదా.. అని ఎవరైనా ప్రశ్నిస్తే.. 'ఛ.. అవునా.. మాకు తెలీదు బ్రో.. అయినా మాకు ఇలాంటి కొటేషన్లు నాన్సెన్స్! అంటూ తలబిరుసుగా సమాధానం చెబుతున్నారు. అందుకే ఏ మాత్రం భయం లేకుండా.. బహిరంగ ప్రాంతాల్లో సైతం 'దుకాణం' తెరుస్తున్నారు. మరీ.. అనైతికమైన సంఘటన ఏంటంటే.. గ్రామాభివృద్ధితో పాటు, సమస్యల పరిష్కారం కోసం కీలకమైన చర్చలకు వారధిగా ఉండే 'రచ్చబండ'ను సైతం.. కొందరు యవకులు 'బహిరంగ' బార్‌గా మార్చేశారు. ఈ దుస్థితి బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలోని కట్టుబడిపాళెం గ్రామంలో నెలకొంది. ఇటు గ్రామ సచివాలయం.. అటు అంగన్‌వాడీ సెంటర్.. మధ్యలో రచ్చబండ ఉంది. అంగన్‌వాడీలో చిన్నపిల్లలు, మహిళలు ఉంటారు. సచివాలయంలోనూ మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూ ఉంటారు. అలాంటి ప్రాంతంలో పట్టపగలే రచ్చబండపై మందుబాబులు మద్యం సేవిస్తుండం విమర్శలకు తావిస్తోంది. దీంతో మైనర్లు కూడా మద్యానికి బానిసలయ్యే ప్రమాదం ఉందని పలువురు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక చీకటిపడిందంటే.. మహిళలు, బాలికలు రచ్చబండ వైపు వెళ్లాలంటేనే భయపడి పోతున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు, పోలీసులకు ఇలాంటి దృశ్యాలు ఎలా కనబడతాయ్! అంటూ ఘాటుగా విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధితశాఖల అధికారులు వెంటనే స్పందించి రచ్చబండ వద్ద మందుబాబులకు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరుతున్నారు.

హామీలు ఏమయ్యాయి?

● చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు ఎప్పుడు..?

● చెప్పి రెండు నెలలు దాటినా ఆచరణ శూన్యం

● జీఎస్టీ మినహాయింపు లేదు... అందని రూ.25వేల ఆర్థికసాయం

● ఎదురుచూస్తున్న చేనేత కార్మికులు


మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

సంగం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గత ఆగస్టు 7న సచివాలయంలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు. ఆ రోజు నుంచే అమలులోకి వస్తుందన్నారు.ఈ మేరకు జీవో నంబరు 44ను విడుదల చేశారు. రెండు నెలలు దాటినా ఆ హామీ అమలు కాలేదు. వంద యూనిట్లకే ఉచిత విద్యుత్ వర్తిస్తోంది. అంతకుమించి ఒక్క యూనిట్ ఎక్కువ వినియోగించినా మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాల్సి వస్తున్నది. దీంతో చేనేత కార్మికులు లబోదిబోమంటున్నారు.

● ఏడువేల కుటుంబాలు

జిల్లాలోని సంగం, వింజమూరు, కోవూరు, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, చెన్నూరు. ఆత్మకూరు, ఏఎస్‌పేట, కావలియడవల్లి, కొత్తపేట, నారాయణరెడ్డిపేట, బుచ్చి తదితర ప్రాంతాల్లో సుమారు ఏడు వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా 3700 చేనేత మగ్గాలపై జీవిస్తున్నారు. మగ్గం నేయడానికి వెలుతురు బాగా ఉండాలి. కేవలం పగలు మాత్రమే మగ్గం నేస్తే జీవనం సాగడం కష్టం. దీంతో చేనేత కార్మికులు తెల్లవారుజాము నుంచే లైట్లు వేసుకుని మగ్గం నేయడం ప్రారంభిస్తారు. సాయంత్రం ఏడు, ఎనిమిది గంటల వరకు మగ్గం నేస్తారు. దీంతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. నెలకు ఒక్కొక్కరు 100 నుంచి 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తారు.

● హామీల అమలు ఎప్పుడో..?

ఉచిత విద్యుత్ జీవో విడుదలైయి రెండు నెలలైనా ఇంత వరకు అమలు కాలేదు. ఇందుకోసం చేనేతలు ఎదురుచూస్తున్నారు. అలాగే చేనేత ముడి సరుకులతోపాటు ఉత్పత్తులకు ఐదుశాతం జీఎస్టీని మినహాయిస్తామన్నారు. కానీ అమలు జరగలేదు. అంతేకాక నేతన్న నేస్తం మాదిరిగానే ప్రతి చేనేత కుటుంబానికి రూ. 25 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. కానీ ఆచరణలో అమలు కాలేదు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం 100 యూనిట్ల వరకే ఆదేశాలందాయి. ఆ మేరకు అమలు చేస్తున్నాం. వంద యూనిట్లు దాటితే మొత్తం బిల్లు చెల్లించాల్సిందే.

- మన్మథరావు, విద్యుత్ ఏఈ, సంగం

ఉచిత విద్యుత్ అమలు చేయాలి



సీఎం చంద్రబాబు ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అధికారులు వెంటనే అమలు చేయాలి. సీఎం ప్రకటించి రెండు నెలలు దాటినా ఇంకా అమలు కాలేదు. దీనివల్ల చేనేత కార్మికులు నెలనెలా వచ్చే కరెంటు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు.

- బుధవరపు బాలాజీ, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు

విధివిధానాలు అందలేదు...

చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ జీవో అయితే విడుదలయింది. కానీ ప్రభుత్వం నుంచి ఇంతవరకు విధివిధానాలు అందలేదు. ప్రభు త్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం.

- శ్రీనివాసులురెడ్డి, చేనేత,జౌళి శాఖ ఏడీ

ఆర్టీసీ హయ్యర్ బస్సు డ్రైవర్ల సమ్మె


సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ హయ్యర్ బస్సు డ్రైవర్లు

కావలి,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్లగా తీసుకోలేదని కావలి డిపోలో హయ్యర్ బస్సు డ్రైవర్లు శనివారం సమ్మెలో పాల్గొన్నారు. బస్సులు ఆపేసి బస్టాండ్ ఆవరణలో నినాదాలు చేశారు. దీంతో ఉదయం నుంచి కావలి డిపో నుంచి రాకపోకలు సాగించాల్సిన 35 హయ్యర్ బస్సులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎంతో కాలంగా తక్కువ జీతాలకు హయ్యర్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్నా.. ఆర్టీసీ అధికారులు ఆన్‌కాల్ డ్రైవర్లుగా తమను కాకుండా ఇతరులను విధుల్లోకి తీసుకోవటం దారుణమన్నారు. కావలి ఆర్టీసీ డిపో యాజమాన్యం తమ పట్ల వివక్ష చూపుతోందని, అందుకు నిరసనగా సమ్మె చేస్తున్నామన్నారు. దీనిపై డిపో యాజమాన్యం స్పందిస్తూ హయ్యర్ బస్సు డ్రైవర్ల జీతాలతో తమకు సంబంధం లేదన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్లుగా వారిని తీసుకుంటే, తాము ఇబ్బందులు పడతామని హయ్యర్ బస్సుల యజమానులు చెప్పటంతో తాము వారిని ఆన్‌కాల్ డ్రైవర్లుగా తీసుకోలేదన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

సంగం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగం గ్రామానికి చెందిన దాదేబత్తిన వెంకటేశ్వర్లు వారం రోజుల నుంచి కనిపించడం లేదని అతని భార్య పద్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే వెంకటేశ్వర్లు కొత్త ఆటో కొనుగోలు చేయాలని ఇటీవల పాత ఆటో అమ్మేశాడు. ఆ తరువాత చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లలేదని తెలిసింది. వారం రోజులైనా ఆచూకీ లేకపోవడంతో ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఈమేరకు పోలీసులు విచారిస్తున్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

వెంకటాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 922 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో 14,764 మంది విద్యార్థులకు గాను 13,842 మంది హాజరయ్యారు.

పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది

ఉదయగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయుడు జే మాధవరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు పార్కింగ్ టైల్స్ వేయించడంతో దానిని ప్రారంభించారు. అలాగే కృష్ణారెడ్డిపల్లికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కాకు రమాదేవి పాఠశాల గ్రంథాలయానికి అవసరమైన రెండు ఐరన్ ర్యాక్‌లు వితరణ చేశారు. అదేవిధంగా కృష్ణారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాకు రవి ఐరన్ బీరువా, బండి ప్రసాద్ మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యంతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభరీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ చైర్మన్ మాలకొండయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ యాదవ్ జన్మదినం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కార్యాలయంలో శనివారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్ జన్మదిన వేడుకలను తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు గుర్రం గోపి, క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, యూనిట్ ఇన్‌చార్జి నాదెండ్ల రాజేంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షుడు పోద మాధవరావు, ఆరికొండ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయాలని వినతి


నీటిపారుదల శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రధాన కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని సీపీఎం రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నీటి పారుదల శాఖ ఎస్ఈ దేశనాయక్‌కు వినతిపత్రం అందించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకయ్య, అధ్యక్షుడు జనార్దన్, ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ మాట్లాడారు. రైతులు నారుమడులు వేసుకోక ముందే సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు దగ్గర 30వ కిలోమీటరు పరిధిలో సాగునీటి కాలువ చాలా సార్లు తెగిపోయిందని, దీనికి శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఐఏబీ ద్వారా ముందుగానే సాగునీటి విడుదల గురించి రైతులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, గురునాధం, గోపనేని రమేష్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన రూరల్ ఎమ్మెల్యే


క్షతగాత్రుడికి నీరు తాపుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

దగదర్తి(బిట్రగుంట) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అల్లూరు రోడ్డు జాతీయ రహదారిపై శనివారం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓవ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే సమయంలో అదే మార్గంలో ప్రయాణిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వాహనం ఆపి క్షతగాత్రుడిని పరామర్శించారు. నీరు తాపి మానవత్వం చాటుకున్నారు. ఇనమడుగు నుంచి వెంకటకృష్ణ ఏలూరుకు బైకుపై వెళుతూ అల్లూరురోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఆ వెనుకనే కారులో మంగళగిరికి వెళుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రోడ్డుపై పడిఉన్న క్షతగాత్రుడి ముఖంపై నీళ్ళు చల్లి, తాగించారు. ఇంతలో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో వెంకటకృష్ణను నెల్లూరుకు తరలించారు. ఎమ్మెల్యే మానవీయ స్పందనను పలువురు ప్రశంసించారు. ఈ మేరకు ఎస్ఐ జంపాని కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు


మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైం) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పలు బార్లు, మద్యం దుకాణాల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య, ఈఎస్ ఏ. శ్రీనివాసులు నాయుడు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మద్యం విక్రయాలు ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ ద్వారా జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో మాట్లాడి సురక్ష యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. డీసీ శంకరయ్య మాట్లాడుతూ సురక్ష యాప్ ద్వారా వినియోగదారులు కొనుగోలు చేసిన మద్యం బాటిల్ అసలైనదా, నకిలీదా అని తక్షణమే తెలుసుకోవచ్చన్నారు. నకిలీ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విక్రయాలు, బెల్ట్ షాపుల గురించి సమాచారం ఉంటే యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ తీగల దగ్ధం


స్తంభంపై దగ్ధమవుతున్న కేబుల్ వైర్లు

వింజమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్ కారణంగా శనివారం పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు దగ్ధం అయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపివేసి అనంతరం పునరుద్ధరించారు. విద్యుత్ శాఖాధికారి నాగూర్‌వల్లి పనులు పర్యవేక్షించారు.

'మండలి'ని కలిసిన యూడీఎఫ్ ప్రతినిధులు

ఉదయగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఉదయగిరి అభివృద్ధి ఫోరం ప్రతినిధులు షేక్‌ఎండీ ఖాజా, శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం రాత్రి నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయగిరి దుర్గం విశిష్టతను వివరించారు. ఉదయగిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.

రైతుబజారు పనులకు మెలిక

● ఎమ్మెల్యే ఒత్తిడితో ఎట్టకేలకు ప్రారంభం ● ఏఎంసీ నిధులతోనే నిర్మాణాలు


రైతుబజారు నిర్మాణానికి వేస్తున్న పిల్లర్లు


రైతుబజారు ముందు నిల్వ ఉన్న మట్టి, ఇసుక, కంకర

కావలి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) కావలి పట్టణ నడిబొడ్డున ఉన్న రైతుబజారు పనులకు తొలుత కాంట్రాక్టర్ మెలిక పెట్టారు. అయితే ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఒత్తిడి మేరకు ఎట్టకేలకు పనులు చేపట్టారు. రైతుబజారు పూర్తయితే నిత్యం నూతన కళ చేకూరుతోంది. రైతుబజారుకు తొలివిడతగా ప్రభుత్వం రూ.45 లక్షలను వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల నుంచి మంజూరు చేసింది. ఆ నిధులతో పనులకు గత జూలై 2న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణలు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న రైతుబజారు పాత షెడ్ల స్థానంలో కొత్త నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. అయితే రైతు బజారు ముందు, వెనుక చాలా ఖాళీ స్థలం ఉండటంతో వర్షం వస్తే రైతు బజారులో వర్షం పడకుంగా ముందు వెనుక కూడా కొత్త షెడ్లను నిర్మించేలా మరో రూ.55 లక్షలకు రైతుబజారు నిధుల నుంచి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనల మేరకు ఇంకా నిధులు మంజూరు కాలేదు. దీంతో శంకుస్థాపన చేసి మూడున్నర నెలలు కావస్తున్నా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా మెలిక పెట్టారు.

● ఎమ్మెల్యే ఒత్తిడితో...

మార్కెటింగ్ కమిటీ నిధులకు బిల్లులు సకాలంలో రావని, రైతుబజారు నిధులతో పంపిన ప్రతిపాదనలు కూడా ఆమోదం పొంది, నిధులు మంజూరు చేస్తే అప్పుడు పనులు ప్రారంభించాలని, లేకపోతే పనులు చేయకుండా తప్పుకోవాలనే కాంట్రాక్టర్ ప్రయత్నం చేశారు. అయితే ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తొలుత మంజూరైన నిధులతో పనులు చేపట్టాలని ఒత్తిడి చేయటంతో ఎట్టకేలకు కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. రైతుబజారు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉండటంతో వారిని అక్కడ నుంచి ఎదురుగా ఉన్న మున్సిపల్ కూరగాయల మార్కెట్ స్థలంలోకి తరలించి అక్కడ నూతనంగా నిర్మించాలని భావించారు. అయితే మున్సిపల్ కూరగాయల మార్కెట్ స్థలం కూడా కొందరికి అధికారులు లీజ్‌కు ఇచ్చి ఉండటంతో అక్కడ ఉన్న వారిని తొలగించడం కుదరలేదు. దీంతో ఎట్టకేలకు రైతుబజారులో దక్షిణం వైపున ఉన్న దుకాణదారులను తొలగించి వారికి రైతుబజారులో ఖాళీగా ఉన్న ప్రాంతంలో స్థలం సర్దుబాటుచేసి దక్షిణం వైపున పిల్లర్లు వేయటానికి గుంతలు తీసి పిల్లర్ల పనులు చేపట్టారు, గుంతల్లో కాంక్రీట్ పిల్లర్లు పూర్తి చేసిన తర్వాత దాని బయటనే నిల్వ చేసి ఉన్న మట్టితో దానిని పూడ్చి మళ్లీ అక్కడ అంతకు ముందు ఉండిన వ్యాపారులకు అందచేస్తారు. ఈ లోపు కొత్తగా ప్రతిపాదనలు పంపిన రూ.55 లక్షల నిధులు మంజూరైతే రైతుబజారు, వెనుక, ముందు మొత్తం కలుపుతూ రైతుబజారు ప్రాంగణం అంతా వర్షం పడకుండా షెడ్లు నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

బోర్డు పెట్టినా.. ఇసుక తవ్వేశారు!

● ముదివర్తిలో రూటు మార్చిన ఇసుక మాఫియా ● ఎడ్ల బండిలో ఇసుక డంప్ చేసి తరలింపు

● ఎమ్మెల్యే, జిల్లా కలెక్టరు ఆదేశాలు భేఖాతరు



ఇసుక రీచ్ వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన వీఆర్వో వెంకటేశ్వర్లు

విడవలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ముదివర్తి ఇసుకరీచ్‌లో అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై స్పందించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా కఠినమైన చర్యలు తీసుకోవాలని మండలాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తహసీల్దారు చంద్రశేఖర్ ముదివర్తి ఇసుక రీచ్‌నకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదని, తవ్వకాలు చేయకూడదని ఇసుక రీచ్ వద్ద శనివారం వీఆర్వో వెంకటేశ్వర్లుచే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. అయితే బోర్డు పెట్టిన కొద్ది సేపటికే ఇసుక మాఫియా రూటు మార్చింది. కోవూరు ఎమ్మెల్యేకి, జిల్లా అధికారులకు సవాలు విసురుతూ 'మా దారి రహదారి.. ఇసుకను ఎలా తరలించాలో మాకు తెలుసు' అంటూ కోవూరు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టరుకు సవాల్ విసిరారు. ఇసుక రీచ్ నుంచి ఎడ్ల బండ్లలో ఇసుకను స్థానిక సచివాయలం వద్ద బహిరంగా ట్రాక్టర్లకి ఎత్తారు. ఇలా ట్రాక్టరునకు రూ. 2వేలు వసూలు చేస్తూ కోవూరు, కొడవలూరు, అల్లూరు, నెల్లూరుకు తరలిస్తున్నారు. ఇసుక తరలింపుల్లో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనపడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయలేరని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

వాహనం వస్తుంటే పక్కకు పరిగెత్తాల్సిందే!

● పట్టించుకోని పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు

● ప్రయాణికుల అవస్థలు


బస్టాండులో మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కలువాయి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు ప్రాంతంలో పొదలకూరు-సోమశిల మెయిన్ రోడ్డుకు ఇరువైపులా దుకాణాల ముందు మట్టితోలి ఎత్తు పెంచుకోవంతో రోడ్డుమీద పడ్డ వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడే నిలిచిపోతుంది. దీంతో రోడ్డుమీద వాహనాలు పోతుంటే ఆ బురద నీరు మీద పడుతుండడంతో పాదచారులు పక్కకు పరిగెత్తుతున్నారు. కనీసం రోడ్డుపక్కన ప్రయాణికులు నడిచేందుకు కూడా లేకుండా దుకాణదారులు రోడ్డు ఆక్రమించారు. వర్షం వచ్చిందంటే బస్టాండులో ప్రయాణికుల అవస్థలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు

ఏఎస్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఠాగూర్ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు దీపావళి ప్రాముఖ్యత గురించి వివరించారు. సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించి, నరకాసురుడి దిష్టి బొమ్మను దగ్ధం చేసి టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ కె దొరస్వామి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

60 అంశాలపై తీర్మానం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సర్వసభ్య సమావేశం కోరం సరిపోవడంతో పంచాయతీ కార్యదర్శి కొప్పోలు రామారావు, సర్పంచి నల్లగొండ్ల సృజన అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ లైట్లకు ఆటోమేటిక్ స్విచ్, పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులు, గ్రావెల్ రోడ్డు, తదితర 60 అంశాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచి గున్నం సుశీల, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560



జీజీహెచ్‌లో జరిగిన దీపావళి పూజలో వైద్యాధికారులు

జీజీహెచ్‌లో ముందస్తు దీపావళి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు జరిగాయి. ధన త్రయోదశిని పురస్కరించుకుని ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదాలను ఉద్యోగులకు పంచిపెట్టారు. ప్రభుత్వ వైద్య శాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి మాట్లాడుతూ అందరూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఆసుపత్రిలోని రోగులు త్వరగా కోలుకోవాలని అకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

భావితరాలు గుర్తుంచుకునేలా
వేణుగోపాలస్వామి ఆలయం

● 29న చిన్నజీయర్‌స్వామిచే శంకుస్థాపన

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేటలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని భావితరాలు గుర్తించుకునేలా శిల్పా లావణ్యంతో పునర్నిర్మిస్తామని నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయం వద్ద నూతన ఆలయ నిర్మాణంపై సందేహాలు, సలహాలు, సూచనల సేకరణకు గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నగర ఎమ్మెల్యే, రాష్ట్ర పురపాల శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈ ఆలయ జీర్ణోద్ధరణకు సంకల్పించారని తెలిపారు. ప్రభుత్వం రూ.16.75కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. పండితులు, పీఠాధిపతుల సూచనల మేరకు నూతన ఆలయాన్ని పూర్తిగా గ్రానైట్ రాయితో నిర్మిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ ఈ ఆలయాన్ని 1879లో బత్తిన పాపిరెడ్డి, సుబ్బమ్మ దంపతులు నిర్మించారని, ఆ తర్వాత పలుపార్లు నిర్మాణ పనులు జరిగాయన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి ఈ నెల 29న చిన్నజీయర్ స్వామి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ నిర్మాణానికి ప్రజలు సహా సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప మాట్లాడుతూ అందరికీ భగవంతుని ఆశీస్సులు లభించేలా ఆలయ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. స్థానికులు సందేహాల్ని తీర్చారు. సరస్వతీ సమాజం అధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ ఈ ఆలయంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు వివాహాలు చేసుకుంటున్నాయని, నూతన ఆలయంతోపాటు కల్యాణ వేదిక నిర్మించి పేదల పెళ్లిళ్లకు అవకాశం కల్పించాలని కోరారు. వేణుగోపాల స్వామి ఆలయంలోకి హరిజనులకు ప్రవేశం కల్పిస్తూ అమరజీవి పొట్టి శ్రీరాములు నిరాహార దీక్ష చేశారని, నాటి శిలాఫలకాన్ని యథావిధిగా ఏర్పాటు చేయాలని విజయమ్మ కోరారు. కోనేరు పక్కనున్న అంజనేయస్వామి ఆలయానికి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు, చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, మూలస్థానేశ్వరాలయం ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, రంగనాథస్వామి ఆలయం ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో ఆరోగ్య జీవనం

ప్రభుత్వ కార్యాలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

పలుచోట్ల మొక్కలు నాటిన అధికారులు , నాయకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతీ ఒక్కరికీ ఆరోగ్యకరమైన జీవనం అవసరమని, ఇందుకోసం పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత పాటించాలని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ పిలుపునిచ్చారు. జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయం, చిల్డ్రన్ హోమ్‌లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ స్టేషన్‌లో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పోలీసులు

మొక్కలు నాటాలి : ధర్మవరం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఒక్కో మొక్క నాటాలని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం 47, 48 డివిజన్ల టీడీపీ శ్రేణులతో కలిసి నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్, కార్పొరేటర్ రామకృష్ణ, కో క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ జాఫర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కల్వకుంట భాస్కర్, ఉపాధ్యక్షుడు మునిశేఖర్, ఇలియాస్ పాల్గొన్నారు.



వీపీసీలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న డీడీ సోమయ్య, సిబ్బంది

పరిసరాలు బాగుంటే..
మనం బాగుంటాం : రూరల్ సీఐ

నెల్లూరురూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు బాగుంటే మనమందరం బాగుంటామని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తన స్టేషన్‌లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐలు లక్ష్మణరావు, సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వాడకం తగ్గించాలి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాహన కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ సోమయ్య పేర్కొన్నారు. నెల్లూరు వెటర్నరీ పాలీ క్లినిక్‌లో శనివారం ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. వ్యక్తిగత వాహనాల వాడకం తగ్గించి ప్రజా రవాణాన్ని వినియోగించుకోవడం వల్ల కూడా కాలుష్యాన్ని కొంతమేర నివారించవచ్చని చెప్పారు. అనంతరం పర్యావరణాన్ని రక్షిద్దామంటూ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి యశోద, ఏడీలు కృష్ణమూర్తి, రామచంద్రారావు, మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసాన చిన్న ఆలయాలకు
దూపదీప కిట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని 300 చిన్న ఆలయాలకు ధూప దీప నైవేద్య సామగ్రి కిట్లు అందించే కార్యక్రమాన్ని శనివారం నగరంలోని వైకుంఠపురం కాశీనాయన ఆశ్రమంలో లాంఛనంగా ప్రారంభించారు. ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని పదేళ్లుగా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కన్వినర్ ధన్వి శ్రీనివాస్ తెలిపారు. ఈ సంవత్సరం ఈ కార్యక్రమానికి ఎయిడ్ ఇండియా ఫౌండేషన్, విజయవాడ భువనేశ్వరి పీఠం, శుభమస్తు షాపింగ్ మాల్ బయ్యా వాసు, ఇతర దాత లు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పూజా సామగ్రి కిట్‌లో రెండు లీటర్ల నువ్వుల నూనె, రెండు అగరవత్తుల ప్యాకె ట్లు, 360 ఒత్తులు, కర్పూరం, గంధం, విభూది, పసుపు, కుంకు మ, కలకండ, ఆధ్యాత్మిక పుస్తక ప్రతులు అందిస్తున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు వెంకటరత్నం, మేకల నరసింహారావు, దర్శిగుంట వెంకటేష్, సుబ్రహ్మణ్యం, వైష్ణవి, జలజ పాల్గొన్నారు.



ఆలయాలకు అందించే ధూపదీప కిట్లతో పంపిణీదారులు

'అవెన్యూస్'లో దీపావళి వేడుకలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అవెన్యూస్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్వేతా సంధ్యా, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వివిధ రకాల వేషధారణలో బాలలు

సేంద్రీయ ఎరువుల్లో పోషకాలు మెండు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులు రసాయనిక ఎరువులకు దీటుగా పనిచేస్తూ నేలకు అవసరమైన ముఖ్య పోషకాలను సమృద్ధిగా అందిస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లలిత శివజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని కేవీకేలో శనివారం గ్రామీణ యువత, రైతులకు వానపాముల ఎరువుపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయనిక మందుల కంటే వానపాముల ఎరువులు వాడటం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. గ్రామీణ యువత వానపాముల ఎరువు అమ్మకం ద్వారా స్వయం ఉపాధి కూడా పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన క్లస్టర్లతో ఎన్నో రాయితీలు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల క్లస్టర్ల ఏర్పాటు వల్ల ప్రభుత్వాల నుంచి ఎన్నో రాయితీలు అందుతాయని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీడీపీ) ప్రాజె క్టు కోఆర్డినేటర్ విద్యాశంకర్ పేర్కొన్నారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధిపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో అను భవమున్న పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. క్లస్టర్ల ఏర్పాటుకు అవసరమైన విధివిధానాలు, సీడీపీ ద్వారా రైతులకు అందే రుణాలు, ఉద్యాన పంటల్లో ప్రాసెసింగ్ చేయడం వల్ల వచ్చే లాభాలు, యూనిట్ల ఏర్పాటు తదితరాలను వివరించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి ఉద్యానశాఖ ద్వారా రైతులకు అందే రాయితీలపై అవగాహన కల్పించారు.

క్యాన్సర్ వ్యాధిపై
అవగాహన పెంచుకోవాలి

● రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ వాకాటి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని, విధిగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని రెడ్‌క్రాస్ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో క్యాన్సర్ వ్యాధిబారినపడిన ఎంతో మంది సరైన చికిత్స అందక మరణిస్తున్నారన్నారు. రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు ఆధునిక చికిత్సలు అందిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ఎక్కువగా ఉందని, ఈ వ్యాధి వ్యాప్తి విషయంలో ప్రపంచంలోనే మన దేశం మొదటి స్థానంలో ఉందన్నారు. జంక్‌ఫుడ్, ఊబకాయం, వ్యాయామం లేకపోవటం, ఎక్కువగా ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడటం, చిన్నారులకు తల్లులు పాలివ్వకపోవటం వంటి కారణాలు రొమ్ము క్యాన్సర్‌కు దారితీస్తున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మౌనికరెడ్డి, డాక్టర్ హరితరాణి, డాక్టర్ నందిత, కౌన్సిలర్ కన్యాకుమారి, డాక్టర్ వెంకట భాస్కర్, రోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, పక్కన డాక్టర్ మౌనిక

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'పై సైకిల్ ర్యాలీ

మనుబోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం అధికారులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినీవిద్యార్థులు సైకిళ్లపై ర్యాలీగా వెళ్లారు. అధికారులు, ఉపాధ్యాయులు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో గరుడయ్య, కార్యదర్శి శ్రావణి, ప్రధానోపాధ్యాయురాలు అమూల్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12308
వెండి కిలో ధర	రూ. 175000
వెండి ఒక గ్రాము	రూ. 181.00

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆలయ ఈవోకు విరాళం అందచేస్తున్న జ్ఞానశ్రీ

రాపూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరుకు చెందిన అనకాల నరసింహులు, ప్రియాంకల కూతురు జ్ఞానశ్రీ జన్మదినం సందర్భంగా రూ.1,00,000 విరాళాన్ని ఆలయ ఈవోకు అందించారు. దాతలు శ్రీవార్లను దర్శించుకుని పూజలు చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ కార్య క్రమంలో వైస్ చైర్మన్ పఠాన్ నస్రీన్, కౌన్సిలర్లు కత్తి శ్రీదేవి, కత్తి నాగరాజు, ఏఈ వెంకటేష్, పూజిత, మెప్మా సీఈఓ నర్మద, టీడీపీ నాయకులు పెంచలయ్య, రమణారెడ్డి, రిసోర్స్ పర్సన్ గండికోట సుధీర్ పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ.. సమాజానికి రక్షణ!

ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఘనంగా బారసాల



తల్లీబిడ్డకు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఇందుకూరుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'ఆడపిల్లల సంరక్షణ.. సమాజానికి రక్షణ' అని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు ఆధ్వర్యంలో ఆడపిల్లల సంరక్షణపై పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించారు. ఆడ శిశువుకు జన్మనిచ్చిన తల్లిని, తండ్రిని సాదరంగా ఆహ్వానించి వస్త్రాలు అందజేశారు. చిన్నారికి బేబీ కిట్, స్వీట్లు, పూలు, పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి ఘనంగా 'బారసాల' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్యాధికారిణి హాజరయ్యారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదరవల్లి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం తదితరులు ఆడశిశువుకు 'ధన్యశ్రీ' అని నామకరణం చేశారు. కుటుంబ సభ్యులను అభినందించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ సుజాత మాట్లాడుతూ బాలికల పట్ల వివక్ష చూపరాదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ఇలాంటివి జరగకుండా తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు, సీహెచ్‌ఓ వీ జ్యోతి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ విజయ్‌కుమార్, హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, సీసీ రామకృష్ణారెడ్డి ల్యాబ్ టెక్నీషియన్ హైమావతి, హెల్త్ అసిస్టెంట్లు మాధవ, సుధాకర్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వాలంటీర్లు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ముత్తుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : టపాసుల దుకాణాల ఏర్పాట్లు, విక్రయాలలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు స్వప్న, ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. మండల కార్యాలయం వెనుక మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాట్లను శనివారం వారు పరిశీలించారు. నిబంధనల మేరకే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు. అనుమతులు లేకుండా టపాసుల విక్రయాలు సాగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితులకు మించి టపాసులు నిల్వ ఉంచరాదన్నారు. ప్రమాదాలకు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీరు ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. వీఆర్‌వో పోలయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

పొదలకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అమరావతి, విజేత, గాయత్రి, నాగార్జున పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్లు సురేష్, కామాక్షి, చైతన్యరెడ్డి, సుబ్బారావు మాట్లాడుతూ చీకటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే పండుగ దీపావళి అని విద్యార్థులకు తెలియజేశారు. టపాసులు పేల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని తెలియజేశారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి ప్రమిదలు, రంగురంగుల ముగ్గులు, అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురిచెర్లపాడులో ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కురిచెర్లపాడు గ్రామంలో శనివారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కనుపూరు పశువైద్యాధికారి డాక్టర్ ఆర్ మంజునాథ్ సింగ్, మండవ ఫౌండేషన్ పశువైద్యాధికారి డాక్టర్ వీ శ్రీనివాసులు నాయుడు పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నితీషా, మౌనిక, రామరాజు, గోపి, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మనిర్భర్ భారత్' దేశ ప్రగతికి చిహ్నం

● జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి

పొదలకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'ఆత్మ నిర్భర్ భారత్' దేశాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆత్మ నిర్భర్ భారత్‌పై సమావేశం నిర్వహించారు. నెల్లూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు శిపారెడ్డి, వంశీధర్ రెడ్డి మండల ఇన్‌చార్జ్ మొద్దు శ్రీనివాసులు, వీరేపల్లి శ్రీనివాసులు రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు పూలా ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అక్కెం జనార్ధన్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సిరిగిరి ఓబులేసు, కార్యదర్శి జి వేణుగోపాల్ నాయుడు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

డొంక దారి సమస్య పరిష్కరించండి

కొడవలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డొంక దారి సమస్య పరిష్కరించి, రైతులకు సహకరించాలని టీడీపీ మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ తహసీల్దారును కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం కొడవలూరు, నాయుడుపాలెం, కొడవలూరు రెవెన్యూ పరిధిలో రైతులతో కలిసి ప్రవీణ్ తహసీల్దారు స్ఫూర్తిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి సొంత నిధులతో కాలువ పూడికతీత పనులు చేయించి రైతులను ఆదుకున్నారన్నారు. డొంక దారి సమస్యను పరిష్కరించాలని తహసీల్దారును కోరారు. ఆయన వెంట రైతులు సామ్యేలు, లక్ష్మారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీఎస్‌యూను హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

వెంకటాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీని హరితవనంగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వ ర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ విచ్చేసి మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రొఫెసర్ టీ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాపూరు: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించామని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా ఆలయ పరిసరాలలో చెత్తను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాచలం: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమ నాయుడు తెలిపారు. మండలంలోని నిడిగుంటపాళెంలో శనివారం వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలతో కలిసి పర్యటించారు. గ్రామ సచివాలయంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీఎస్టీ జిల్లా అధికారిణి ప్రమీల, ఎంపీడీఓ కల్పన, టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, నిడిగుంటపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, నేతలు రావూరి పద్మనాభనాయుడు, వెంకట కృష్ణమనాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు అసనాపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సర్వేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రాధాకృష్ణమనాయుడు సైకిల్ ర్యాలీని ప్రారంభించారు.

విద్య పాఠ్య పుస్తకాలకే పరిమితం కాదు

వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్య అనేది కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాదని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శనివారం బిజి నెస్ మేనేజ్ మెంట్ విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న వనరులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్, డాక్టర్ చెంచురెడ్డి, డాక్టర్ జీ సాయి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

చెత్తరహిత ఆత్మకూరు సాధనకు కృషి

ఆత్మకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత ఆత్మకూరు సాధనకు కృషి చేస్తు న్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఆయన పలు కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. హనుమాన్ జంక్షన్ సమీపం లోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. అధికా రులు, కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి సైకిల్‌ర్యాలీని ప్రారంభించా రు. కార్యక్రమాల్లో జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, డిటిసి చందర్, ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తాహ సీల్దారు జి పద్మజాకుమారి, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

దుకాణాలకు అనువైన స్థలం లేక
వ్యాపారుల అవస్థలు

పొదలకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో టపాసుల దుకాణదారుల్లో ఆందోళన నెలకొంది. లక్షలాది రూపాయలు పెట్టి వ్యాపారులు సరుకు కొనుగోలు చేశారు. అయితే.. లాభాలు దేవుడెరుగు.. అసలు తెచ్చిన సరుకు అమ్ముడుపోతుందో... లేదో... అని వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. దీనికితోడు దుకాణాలు ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి కళ్యాణ మండపం లోపల దుకాణాలు నిర్వహించుకునేవారు. ఇప్పుడు ఆ స్థానంలో నూతనంగా కొత్త ఫంక్షన్ హాల్ నిర్మించడంతో అక్కడ అవకాశం లేకుండా పోయింది. దీంతో చేసేదేమీ లేక గతేడాది కళ్యాణ మండపం ఆరుబయట ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆరుబయట దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే టెంట్లకు భారీగా ఖర్చు అవుతుందని వ్యాపారస్తులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కళ్యాణ మండపం బయటి స్థలమంతా రొచ్చు రొచ్చుగా మారింది. అందులో ఒక్కో అధికారి రావడం.. ఒక్కోచోట దుకాణాలు ఏర్పాటు చేసుకోండని చెప్పడంతో దుకాణదారుల్లో గందరగోళం నెలకొంది. ఒకవేళ ఆరుబయట దుకాణాలు నిర్వహిస్తే భారీ వర్షాలకు సరుకు ఎక్కడ తడిసిపోతుందోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. దానికితోడు హైరర్స్ వాళ్లు అమాంతం ధరలు పెంచివేయడంతో టపాసుల వ్యాపారులు సందిగ్ధంలో పడిపోయారు. ఉన్న సరుకును ఎలా కాపాడుకోవాలి.. ఎలా అమ్ముకోవాలంటూ తలలు పట్టుకుంటున్నారు. మూడు రోజుల వ్యాపారానికి ఎన్నో ఆటంకాలు వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులే ప్రత్యామ్నాయం చూపాలని వేడుకొంటున్నారు.

బీసీ కులగణన తరువాతే
స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీల సమగ్ర కులగణన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల ని, బీసీల డిమాండ్లు నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పనమాల శ్రీహరి రావు ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని పూలే విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌కు జిల్లాలో నల్ల బ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ముంగర శైలజ, మహిళా అధ్యక్షురాలు నర్మద, లోకనాథం, రామ కృష్ణ, తరుణ్ సింగ్, శ్రీకాంత్, నవనీతమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధికి సహకరిద్దాం!

కోవూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సాగిస్తున్న కృషికి సహకరించాల్సిందిగా పాటూరు నీటిసంఘాల ఉపాధ్యక్షుడు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి శనివారం కోరారు. గంగవరం గ్రామం పంచాయతీ కార్యాలయం వద్దకు తెదేపా నాయకులు చేరుకొని గ్రామంలోని సమస్యలపై అధికారుల్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని పదివార్డుల్లో వీధిదీపాలు, మంచినీటి సమస్యలున్నట్లు తెలియచేశామన్నారు. గ్రామంలో సకాలంలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు సమస్యల్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. పంచాయతీ కార్మికుల సమస్యల్ని పంచాయతీ, మండల పరిషత్ అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా చూడాల్సిందిగా ఆయన కోరారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సాగిస్తున్న అభివృద్ధికి అధికారులు సహకరించాల్సిందిగా కోరారు.

పొదలకూరు గేట్ సెంటర్‌లో వెలగని లైట్లు



గేట్ సెంటర్ కూడలిలో వెలగని ఎల్‌ఈడీ లైట్లు

పొదలకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గేట్ సెంటర్ ప్రధాన కూడలి రోడ్లలో ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురవుతోంది. గేట్ సెంటర్‌కు నలు దిక్కులా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు గత కొంత కాలంగా వెలగకపోవడంతో చీకటి అలముకుంటుంది. పొదల కూరుకు ప్రధాన ఆకర్షణగా ఉండే సంగం రోడ్డు, గేట్ కూడలి గేట్ సెంటర్ కూడళ్లలో గతంలో పెద్ద ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన నాటి నుంచి వీటి నిర్వహణ కొంత కాలం సజావుగా జరిగింది. ప్రస్తుతం ఈ లైట్లు వెలగకపోవడంతో అంధకారంలో ఉన్నాయి. దీపావళి పర్వదినాన కళకళలాడాల్సిన ప్రధాన కూడలి రోడ్లు, ఎల్‌ఈడీ లైట్లు నిర్లక్ష్యం కారణంగా వెలగకపోవడంతో పట్టణవాసుల్లో అసహనం నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ, విద్యుత్ అధికారులు ఈ కూడళ్లలో లైట్లు పునరుద్ధరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

ఉదయగిరి, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం సేల్స్ ట్యాక్స్ రవాణా శాఖాధికారులు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం 99 రకాల వస్తువులపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించిందన్నారు. అనంతరం కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌ట్యాక్స్ ఉప సహాయ కమీషనర్ ఎన్‌వీ సుబ్బారావు, ఎంవీఐ, సహాయ ఎంవీఐ గోపినాయక్, కరుణాకరన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు







కందుకూరులో స్వచ్ఛాంధ్ర ర్యాలీ


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు హిమవంశీ తదితరులు

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని కందుకూరులో శనివారం భారీ సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆర్టీసీ డిపో వరకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు దామెర హిమవంశీ తదితరులు స్వయంగా సైకిళ్లు తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వర రావు, చిలకపాటి మధుబాబు, నార్నె రోశయ్య, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, పోకూరి రాంబాబు, మంచిరాజు మురళి, చుండూరి మాల్యాద్రి, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, పాల్గొన్నారు.

'ప్రకాశం'లో స్వయంచాలక వాహన భద్రతపై సెమినార్

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థుల కోసం స్వయంచాలక వాహన భద్రతపై గ్యాస్‌ల ప్రభావం అనే అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌శాఖ హెచ్‌ఓడీ డాక్టరు కె సుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల పూర్వ విద్యార్థిని సంయుక్త ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలో తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టరు కె. విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ


వాహనదారులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేస్తున్న ఆర్టీవో టీవీఎన్ లక్ష్మి

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించటం కోసం కందుకూరు ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిళ్ల షోరూంలలో జీఎస్టీ ద్వారా లబ్ధిపొందిన వాహనదారులకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ జె అనిల్‌కుమార్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ యానాదిపాల్గొన్నారు.

వర్షాలతో వరిపైరుకు నష్టం

కందుకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మాచవరంలో వరిపైరుకు నష్టం వాటిల్లింది. శనివారం మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం మాచవరం గ్రామాన్ని సందర్శించి వరిపైరును పరిశీలించారు. రమారమి 200 ఎకరాలలో వరిపైరుకు భారీవర్షాల కారణంగా నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 11,67,412

వలేటివారిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామికి శనివారం భక్తుల నుండి రూ. 11,67,412 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.











ఘనంగా గంధ మహోత్సవం

ఉదయగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనకాలువ సమీపంలో ఉన్న హజరత్ సయ్యదినా మహబూబ్‌సుభానీ వారి గంధమహోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చికెన్ ధరలు


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12308
వెండి కిలో ధర	రూ. 175000
వెండి ఒక గ్రాము	రూ. 181.00











చెత్తరహిత ఆత్మకూరు సాధనకు కృషి

● రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం

ఆత్మకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత ఆత్మకూరు సాధనకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఆయన పలు కార్యక్రమా ల్లో పాల్గొన్నారు. హనుమాన్ జంక్షన్ సమీపం లోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. పర్యా వరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. అధికా రులు, కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి సైకిల్‌ర్యాలీని ప్రారంభించా రు. కార్యక్రమాల్లో జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, డిటిసి చందర్, ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తాహసీల్దారు జి పద్మజాకుమారి, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్, సిఐలు జి గంగాధర్, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయగిరిలో ఉన్నత పాఠశాల నుంచి మెయిన్‌బజార్ మీదుగా పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు అధికారులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌ట్యాక్స్ ఉప సహాయ కమిషనర్ ఎన్‌వీ సుబ్బారావు, ఎంపీఓ, అసిస్టెంట్ ఎంపీఓ గోపినాయక్, కరుణాకర్, ప్రధానోపాధ్యాయుడు జీ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం శని వారం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో అధికారులు పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచిలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కావలి : 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం కావలి మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' సాధనకు కృషి చేస్తామ ని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : స్వర్ణాంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

ఉదయగిరి, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం సేల్స్ ట్యాక్స్ రవాణా శాఖాధికారులు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం 99 రకాల వస్తువులపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించిందన్నారు. అనంతరం కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌ట్యాక్స్ ఉప సహాయ కమీషనర్ ఎన్‌వీ సుబ్బారావు, ఎంపీఓ, సహాయ ఎంపీఓ గోపినాయక్, కరుణాకరన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కావలి (టౌన్) అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఫలాలు ప్రతిఒక్కరూ అందుకోవాలని ఎమ్మె ల్యే డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పాతూరులోని క్లాత్ మర్చంట్స్ కల్యాణమండపంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు జరిగింది. చవేరా గ్రూప్ అధినేత చెన్నా వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. కా ర్యక్రమంలో కందుకూరి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత కందుకూరి సత్యనారాయణ, ఏపీ జీఎస్టీ సల హామండలి సభ్యులు అమరా వెంకటసుబ్బారావు, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాదరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ నేరెళ్ళ జ్వాలారావు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

ఉదయగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని అనుమతు ల్లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు ఎల్ రామ్మోహన్, అగ్ని మాపక శాఖాధికారి హరిబాబులు హెచ్చరించారు. శనివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఉదయగిరి 5, సీతారామపురం 4, వరికుంటపాడు మండలంలో ఒక దుకాణానికి మాత్రమే బాణసంచా విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

●సంగం: స్థానిక టపాసుల దుకాణాలను తహసీల్దారు సోమ్లానాయక్, సీఐ వేమారెడ్డి శనివారం పరిశీలించారు. దుకాణదారులకు సలహాలు అందచేశారు.నిబంధనలు అతి క్రమిస్తే దుకాణాల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు.

●కలువాయి : పర్యావరణానికి హాని కల్గించే రసాయనాలతో కూడిన టపాసులు అమ్మరాదని తహసీల్దారు డి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో దుకాణదారులకు సూచించారు.

విస్తరణ పనులకు సహకరించండి

కలిగిరి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 167 బీజీ విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించి శనివారం తహసీల్దార్ గిరీశ్ వివిధశాఖల అధికారులు, నేషనల్ హైవే అథారిటీతో కలసి పట్టణంలో పర్యటించారు.గ్రామపెద్దలతో రోడ్డు విస్తరణపై చర్చించారు. పూర్తి వివరాలతో సోమవారం మార్కింగ్ చేస్తామని, అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి, జడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, చేరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలికా దినోత్సవ వారోత్సవాలు

కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవ నేపథ్యంలో మండలంలో ఐసీడీఎస్ ఆధ్వ ర్యంలో జరుగుతున్న వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆడపిల్లల హక్కులపై ర్యాలీ నిర్వహించారు. 'ఆడపిల్లలను పుట్టనిద్దాం... ఎదగనిద్దాం... చదవనిద్దాం' అనే అంశంపై విద్యార్థినులకు వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎమ్ఎల్‌హెచ్‌పి మార్గరెట్, మహిళా కానిస్టేబుల్ శ్రావణి, వెల్ఫేర్ అసిస్టెంటు మంజుల, అంగన్‌వాడీ టీచర్లు మమత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీవో

వింజమూరు, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటుచేసి విక్రయించుకున్న, విక్రయించు కుంటు న్న లేఅవుట్ల యజమానులు ఎల్ ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి సూ చించారు. శనివారం స్థానిక పంచా యతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కొప్పర్తి రామారావుతో కలిసి ఎంపీడీవో విలేకరుల సమావేశం ఏర్పా టుచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లా డుతూ అక్టోబరు 23వ తేదీతో ఎల్ఆర్ఎస్‌కు గడువు ముగుస్తుందని, లేఅవుట్ల యజ మానులు, ప్లాట్లు కొనుగోలుచేసిన వారు ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లో చేరాలని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. అక్టోబరు 23వ తేదీ తర్వాత అనుమతులు లేని లేఅవుట్లపై కఠిన చర్యలుతప్పన్నారు. పంచాయతీ కార్యదర్శి రామారావు మాట్లాడుతూ అనుమతులు లేని లేఅవుట్‌లకు ఎన్ఓసీ ఇవ్వమన్నారు. అదే విధంగా భవనాల నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఉండవన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శికి ఎమ్మెల్యే పరామర్శ

కావలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) కావలి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు బచ్చు వీరాస్వామి ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడ్డారు. శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అయనను శనివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బృందావనం హౌసింగ్ కాలనీలోని తన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

బోగోలు మండల సాధారణ సర్వసభ్య సమావేశం

బిట్రగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎంపీపీ మేకల సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యుత్ ఏఈ జడరాయ మాట్లాడుతూ మండలంలో లోఓల్టేజ్ సమస్యలు లేకుండా పలుప్రాంతాలో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చామన్నారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జగ్రత్తలపై కోవూరుపల్లి సీహెచ్‌వో నజీమున్నీసా మాట్లాడారు. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో దెబ్బతిన డ్రైనేజ్ కాలువ మరమత్తుల విషయమై అధికారులు సహకరించడం లేదన్నారు. నాగులవరం పీఏసీఎస్ ఛైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతు కావలి ఎమ్మెల్యే దగుమాటివెంకటక్రిష్ణారెడ్డి రైతు పక్షపాతి అని ఆయన చొరవతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అందచేసేందుకు వ్యవసాయ శాఖతో కలిసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈ శ్రీనివాసులు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

● డైట్ సీనియర్ అధ్యాపకుడు

ఏఎస్ పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యా యులు శ్రద్ధ చూపించాలని జిల్లా డైట్ సీనియర్ అధ్యాపకుడు ఎల్ నటరాజన్ మూర్తి తెలిపారు. శనివారం ఆయన శ్రీకోలను పాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సి,డి గ్రేడ్ విద్యార్థులను ఎగ్రేడ్ విద్యార్థులుగా తీర్చి దిద్దడానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతి, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జ్యోతి, సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత

ఉదయగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని కోళ్లవీధికి చెందిన షేక్ జానీబాషా, దిల్‌షాద్ దంపతుల కుమార్తె సబియా వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శనివారం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తుమ్మల కిరణ్‌బాబు, మస్తాన్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.













ఏళ్లు గడుస్తున్నా నీళ్లేవి?



నెలబల్ల పొలాల్లో ప్రవహిస్తున్న 14(ఆర్) గంగ కాలువ

1. పడమట్టికండ్రిగ అడవిలో 14(ఆర్) కాలువ
2. మైలాంగం మద్దెలగుంట చెరువు సమీపంలో 14(ఆర్) గంగ కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు
3. అవలిగండి చెరువు సమీపంలో అడవిలో ఆగిన కాలువ పనులు
4. పడమట్టికండ్రిగ అడవిలో తవ్విన కాలువ అసంపూర్తి పనుల్లో దట్టంగా పెరిగిన చెట్లు

- నత్తనడకన 14(ఆర్) గంగ కాలువ పనులు
- ఆశగా నిరీక్షిస్తున్న 25 గ్రామాల రైతులు
- కాలువలు పూర్తయితే 38వేల ఎకరాలకు నీరు

తెలుగుగంగ కాలువ పనులకు ఆది నుంచి అడ్డంకులు శాపంగా పరిణమిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం పునాది పడినా నేటికీ అడుగు ముందుకు పడటం లేదు. ఫలితంగా ఈ కాలువ నీటితో సాగుచేయాలనే రైతుల కోరిక నెరవేరడంలేదు. 2002లో దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 38వేల ఎకరాలకు సాగు నీరందించాలనే సంకల్పంతో నాటి టీడీపీ ప్రభుత్వం 14(ఆర్) తెలుగుగంగ కాలువ పనులకు శ్రీకారం చుట్టింది. కండలేరు జలాశయం నుంచి చెన్నై వెళ్లే సత్యసాయి తెలుగుగంగ కాలువకు ఉప కాలువగా దీనిని రూపొందించారు. రెండు మండలాల్లో 25 గ్రామాల రైతులకు ఉప కాలువల ద్వారా సాగు నీరు అందించాలనేది ఉద్దేశం.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

23 సంవత్సరాలుగా వీడని గ్రహణం

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2002లో కాలువ పనులు ప్రారంభించింది. అయితే రెండేళ్లకే ప్రభుత్వం మారిపోయింది. కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టింది. దీంతో పనులకు గ్రహణం పట్టింది. పనులు ఆగిపోయాయి. కొన్నిచోట్ల అటవీ శాఖ అనుమతులు లేక, ఎగువ ప్రాంత రైతుల అభ్యంతరాలు తదితర కారణాలతో పనుల్లో పురోగతి కనిపించలేదు. తమ భూముల్లో కాలువపోతుందని మరోపక్క నెలబల్లి గ్రామ రైతులు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపారు. దీంతో పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో ఈ విషయంలో కనీస శ్రద్ధ చూపలేదు.

పునఃప్రారంభమైనా మళ్లీ బ్రేక్

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కాలువకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని నాటి సీఎం చంద్రబాబు ఆదేశించారు. పనుల కోసం రూ.22.5 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో మంత్రిగా ఉన్న నారాయణ చొరవ తీసుకుని అటవీశాఖ అనుమతులు రప్పించడంలో సఫలీకృతమయ్యారు. నెలబల్లి రైతులనూ ఒప్పించారు. వారి పరిహారం పైనా చర్యలు తీసుకోవడంతో 2016 ఆగస్టులో 14(ఆర్) కాలువ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అయితే కొన్ని రోజులకే వర్షాలు కురవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. తిరిగి ప్రారంభించడంలో నిర్లక్ష్యం చూపుతూ వచ్చారు.

గాలికొదిలేసిన వైసీపీ : 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలువ పనులపై శీతకన్ను వేసింది. దీనికితోడు కాంట్రాక్టర్లలోనూ చలనం కనిపించలేదు. అనుమతులు వచ్చిన అటవీ ప్రాంతాల్లోనూ తవ్వకాలను గాలికొదిలేశారు. ప్రతిపాదిత వంతెనల నిర్మాణాల ఊసే పట్టించుకోలేదు. చివరి తడికోసం రైతులు అల్లాడిపోయినా వైసీపీ ప్రభుత్వ పెద్దలు కన్నెత్తి చూడలేదు. ఈ నేపథ్యంలో ఏడాదిన్నర క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు సీఎం కావడంతో ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే నేటికీ పనుల్లో కదలిక రాలేదు. నాడు ఈ పనుల విషయంలో చొరవ చూపిన మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. 38వేల ఎకరాలకు సాగునీరందించే కాలువ పనులు పూర్తి చేస్తారని వీరంతా ఆశతో నిరీక్షిస్తున్నారు.



ప్రభుత్వం చొరవ చూపాలి

కాలువ పనులను పూర్తి చేస్తే నెలబల్లికి దిగువ ప్రాంత గ్రామాలైన పడమట్టికండ్రిగ, ఆనేపూడి, వడ్డికండ్రిగ, పూలతోట, కొత్తపల్లి గ్రామాలకు నీరు వస్తుంది. సూళ్లూరుపేట మండలంలో కోటపోలూరు, తూర్పుపల్లెలకు గంగ నీరు చేరుతుంది.పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చు. కాలువ సమస్యను పరిష్కరించేందుకు పాలకులు చొరవ చూపాలి.

- మురళీరెడ్డి, సర్పంచ్, ఆనేపూడి

చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్నాం



ఏళ్ల తరబడి కాలువ నీటి కోసం ఎదురు చూస్తున్నాం. పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆగిన పనులను పూర్తి చేస్తే నేలపట్టు, మైలాంగం గ్రామాల్లో పంటలు ఎండిపోకుండా రక్షించుకోవచ్చు. ఈ ఏడాది మేమే కొన్నిచోట్ల చిన్నపాటి కాలువలుగా తవ్వి నీరు తెచ్చుకున్నాం. పక్షుల విడిదికి కూడా 14(ఆర్) గంగ కాలువ నీరు అవసరం.

- దువ్వూరు గోపాలరెడ్డి, ఉప ఎంపీపీ, మైలాంగం



హైందవ ధర్మ పరిరక్షణలో.. నాయీ బ్రాహ్మణుల పాత్ర కీలకం

- ధన్వంతరి జయంతి ఉత్సవంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్
- తిరుపతి నగరంలో వైభవంగా శోభాయాత్ర



తిరుపతి(ఉపాధ్యాయనగర్), అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): హైందవ ధర్మాన్ని రక్షించడంలో నాయీ బ్రాహ్మణుల పాత్ర కీలకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. వారి సంప్రదాయ వృత్తి కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతోందని, తద్వారా ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి వృత్తి కార్పొరేట్‌పరం కాకుండా కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రులు, జైళ్లు, పోలీసు శాఖల్లో నాయీ బ్రాహ్మణులకు ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయాల్లో నాదస్వరం, డోలు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తిరుపతిలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శోభాయాత్ర, సభా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మాధవ్ పాల్గొన్నారు. ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కంటే ముందే విదేశీ శక్తులు వర్ణ వివక్షతో బీసీ కులాలపై దాడి చేశాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో బీసీ కులాల పాత్ర కీలకమని వివరించారు. బీసీ కులాలను వివక్ష నుంచి విముక్తి చేయడానికి ధన్వంతరి జయంతి ఉత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు.నాయీ బ్రాహ్మణుల హక్కుల పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. దీనికిముందు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడారు.

కన్నులపండువగా శోభాయాత్ర

ధన్వంతరి జయంతి ఉత్సవంలో భాగంగా తిరుపతిలో శోభాయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. బాలాజీకాలనీ పూలే విగ్రహం నుంచి గాంధీభవన్ వరకు సాగిన ఈ యాత్రలో నాయీ బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు గాంధీభవన్ వేదికగా ధన్వంతరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, దీపప్రజ్వలనతో సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సినీ సంగీత దర్శకురాలు, గాయని ఎంఎం శ్రీలేఖ ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.



సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా నేతలు సామంచి, భానుప్రకాష్‌రెడ్డి

మేనకూరు సెజ్‌లో త్వరలో సంగం డెయిరీ

- చైర్మన్ దూళిపాళ నరేంద్ర వెల్లడి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మేనకూరు సెజ్‌లో త్వరలో సంగం డెయిరీ ప్రారంభించనున్నట్లు చైర్మన్, ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర తెలిపారు. శనివారం రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో భూమిని సేకరించి 2 లక్షల నుంచి 4 లక్షల లీటర్ల సామర్థ్యంతో డెయిరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంత పాడి రైతుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో డెయిరీ ద్వారా లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో సంగం డెయిరీ ప్రారంభిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు శివప్రసాద్, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రఫి, సంచి కృష్ణయ్య, పెసల కిషోర్‌బాబు, అశోక్‌రెడ్డి, విజయకుమార్ నాయుడు, ప్రసాద్‌నాయుడు, సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, రవి, చెంగయ్య, భాస్కర్, చెంచయ్య, అవధానం సుధీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, విజయశ్రీ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు
- ఎస్వీయూలో ముగిసిన యువతరంగ్ - 2025

మానవ జీవన వికాసానికి కళలే మూలాధారం







తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన వికాసానికి కళలు మూలాధారంగా నిలుస్తాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయ భాస్కరరావు పేర్కొన్నారు. మూడు రోజులుగా ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువతరంగ్ - 2025 కార్యక్రమం శనివారం ముగిసింది. సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించిన సమాపనోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక అంశాల్లోనూ ప్రతిభను పెంచుకోవాలని కోరారు. కళల్లో మన సంస్కృతి సంప్రదాయాలు నిక్షిప్తమై ఉన్నాయని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథి ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సంగీతం, నృత్యం, కళల పట్ల ఆసక్తిని పెంపొందించినట్లు అయిందని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, న్యాయ నిర్ణేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చివరి రోజు సందడే సందడే

యువతరంగ్‌లో భాగంగా మూడవ రోజైన శనివారం శ్రీనివాస ఆడిటోరియం, అన్నమయ్య భవనం, సెనేట్ హాల్లో సాంస్కృతిక పోటీలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రత్యేక ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు.





తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా మౌర్య

తిరుపతి జేసీకి అదనపు బాధ్యతలు



తిరుపతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జాయింట్ కలెక్టర్‌కు నెల్లూరు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. అయితే తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇటీవల జరిగిన బదిలీల్లో పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ పొందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఇప్పటివరకు రెగ్యులర్ జేసీని నియమించలేదు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్యకు జాయింట్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం తిరుపతి జేసీకి నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ పోస్టులో కూడా తిరుపతి కమిషనరే తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగనున్నారు.

స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):దీపావళి పండుగ సందర్భంగా సోమవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయని, రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్వచ్ఛ దీపావళే లక్ష్యం

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛ దీపావళి లక్ష్యంగా పండుగ చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. పర్యావరణ అనుకూలమైన బాణసంచా, దీపాలు, కొవ్వొత్తులు ఉపయోగించాలని సూచించారు. తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య పరిశీలించి దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గూడూరు రూరల్ ఎస్ఐగా తిరుపతయ్య



గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గూడూరు రూరల్ ఎస్ఐగా తిరుపతయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న మనోజ్‌కుమార్ గూడూరు ఒకటో పట్టణ ఎస్ఐగా బదిలీ అయ్యారు. అక్కడున్న తిరుపతయ్య రూరల్‌కు వచ్చారు.

జీఎస్టీ 2.0తో అన్ని వర్గాలకు ప్రయోజనం: కురుగొండ్ల



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై శనివారం డక్కిలిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. డక్కిలిలోని దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటరు నుంచి కమ్మపల్లి రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరించారు. అనతంరం డక్కిలి సచివాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో రవీంద్రబాబు, ఎంఈవో జగదీష్, ఎస్ఐ శివశంకర్, ఏపీవో కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డి, మోపూరు, దగ్గవోలు, లింగసముద్రం సొసైటీల అధ్యక్షులు పులి జనార్దనరెడ్డి, ఈతముక్కల సురేంద్ర, రంగినేని రాజా, టీడీపీ నాయకులు చెలికం నారాయనరెడ్డి, దందవోలు పెంచలరెడ్డి, డక్కిలి సునీల్ రెడ్డి, పోకూరు రమేష్, పీపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఉపాధ్యక్షుడికి పరామర్శ

పెళ్లకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన నాయుడుపేట ఏఎంసీ ఉపాధ్యక్షుడు కిలారి గోపిని పలువురు టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. గోపి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇటీవల చికిత్స తీసుకున్నారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, గంగాబత్తిన రామకృష్ణ, సన్నాడి వేణురెడ్డి తదితరులు పరామర్శించారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దారు, సర్వేయురు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి శనివారం అధికారులు స్థలాలను పరిశీలించారు. తహసీల్దారు జయజయరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్‌వో రమణయ్య ఆర్టీసీ బస్టాండు సెంటర్, ఆర్‌ఆర్ థియేటర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నేత

డక్కిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మధవనాయుడు శనివారం ఎస్పీ సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య ఉన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎఫ్‌వో

మంగళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎఫ్‌వోగా ఆయన పనిచేశారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర



మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు

సూళ్లూరుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని అన్ని వార్డుల్లో పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

ఓజిలి: స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంపై ఓజిలిలో ఎంఈవో శైలజ అధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దారు, ఎంఈవో, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టపాసుల దుకాణదారులు నిబంధనల మేరకే విక్రయాలు జరపాలని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జయజయరావు అన్నారు. శనివారం కోట, విద్యానగర్‌లోని టపాసుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికులకు పాదచారులకు, వాహనచోదకులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా టపాసుల విక్రయాలు జరపాలన్నారు. ఎక్కడైన లోపాలు జరిగినట్లు తెలిస్తే సంబంధిత దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు. ఇప్పటి వరకు 15టపాసుల దుకాణాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు, అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం భవనాలను కూల్చొద్దు

- ఆస్తుల పరిరక్షణకు బోర్డు ఏర్పాటు చేయాలి
- మాజీ ఎంపీ సీతారాం నాయక్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాలను కూల్చవద్దని హథీరాం బావాజీ పరిరక్షణ సమితి తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ కోరారు. ఈ భవనాలు బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీకగా పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మఠం భవనాలను కూల్చాలనే నిర్ణయానికి తాము పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఆలోచించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలతో చలో తిరుపతికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. తమ భాషకు లిపిలేని కారణంగా వెనుకబాటు తనంలో ఉన్నామని తెలిపారు. మఠం ఆస్తుల పరిరక్షణకు బోర్డు ఏర్పాటు గురించి ప్రభుత్వాలు పట్టించు కోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి బాబురావు చౌహన్, తెలంగాణా మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మహారాష్ట్ర మాజీ ఎంపీ హరిభవ్ రాథోడ్, తెలంగాణా ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కిషన్ సింగ్, తెలంగాణా మాజీ ఎమ్మెల్సీ రాహుల్ నాయక్, ఏపీ ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజనేయులు, అశోక్ రాథోడ్, రవినాయక్, రవీంద్ర నాయక్, నారాయణ నాయక్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో నూతన ప్యాకేజీ టూర్లు

తిరుపతి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా కొత్త ప్యాకేజీ టూర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటకశాఖ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ● మహానంది, శ్రీశైలానికి ఈనెల 26న, వచ్చేనెల 2న, 9న, 16తేదీలలో (ఆదివారాలలో) రాత్రి 7గంటలకు తిరుపతి నుంచి బస్సు బయల్దేరి సోమవారం మహానంది, శ్రీశైలం దర్శనం కల్పించి మంగళవారం ఉదయం తిరుపతికి బస్సు తిరిగి చేరుకుంటుంది. ఒకరికి పెద్దలకు రూ. 4,310, పిల్లలకు 3,640, నాన్‌ఏసీ రవాణా, స్వల్ప వసతి, భోజన సదుపాయం, గైడ్ సౌకర్యం ఉంటుంది. ● కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైకి ప్రతిరోజూ యాత్రలో భాగంగా రవాణా, గైడ్ సౌకర్యంతో కలిపి ఒకరికి పెద్దలకు రూ. 1,200, పిల్లలకు రూ.960. ● అలాగే శబరిమలై యాత్రకు, పెళ్లిళ్లకు, ఇతర యాత్రలకు 36సీట్ల గల నాన్‌ఏసీ హైటెక్ బస్సులు, 45సీట్ల ఓల్వో ఏసీ బస్సులను అద్దెకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాల కోసం 0877-2289123, 9848007033, 9848802099, 9848973985 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

10 వేల విద్యుత్ కనెక్షన్లతో నెంబర్‌వన్‌గా నిలుద్దాం: ఆరణి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం కింద తిరుపతిలో 10 వేల కనెక్షన్లు ఇచ్చి నెంబర్ వన్‌గా నిలుద్దామని ఇందుకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో కలిసి ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్యానల్‌పై ఉన్న 12శాతం జీఎస్టీ 5శాతానికి తగ్గించారన్నారు. దీనివల్ల ప్రతి లక్ష రూపాయలకు రూ.4,900లు తగ్గుతుందన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకొనే వారికి కేంద్ర ప్రభుత్వం రూ.78వేల రాయితీ కూడ మంజూరు చేస్తుందని వివరించారు. సోలార్ కనెక్షన్ తీసుకున్నవారికి బ్యాంక్‌లు రుణసదుపాయం కల్పిస్తాయని తెలియజేశారు. మన వద్ద మిగులు విద్యుత్‌ను విద్యుత్ సంస్థ కొనుగోలు చేసి నగదు చెల్లిస్తుందని వివరించారు. అంతకు ముందు సోలార్ రూఫ్ టాప్ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వి.చంద్రశేఖర్‌రావు, ఈఈలు సి.గంగాధర్‌రెడ్డి, పుల్లా బాలాజీ, విశ్రాంత ఎస్ఈ ఎస్.ముని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనిత్రయోదశి పూజలు



స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో పాల్గొన్న శంకర్‌రెడ్డి

నాగలాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయంలో శనివారం శని త్రయోదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన అనంతరం మహా, కుంభ, నక్షత్ర హారతులు చేపట్టారు. అనంతరం మరకదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి ఉత్సవర్లను సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. పూజల్లో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ పద్మనాభరాజు, సభ్యులు నెల్సన్ మండేలా, శ్రీనివాసులునాయుడు, నాగభూషణమ్మ, హంస, జయంతి,దేవి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా పళ్లికొండేశ్వర ఆలయాన్ని శనివారం జిల్లా న్యాయమూర్తి అరుణసారిక సందర్శించారు. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో జిల్లా జడ్జికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు కల్పించారు.

నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమాలోచన

పిచ్చాటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌తో సమాలోచన చేశారు. నియోజకవర్గంలో 17 పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.5.44 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, తాగునీరు, పైపులైన్, శ్మశనానికి రోడ్డు, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయ, సంబంధిత అధికారులతో వెంటనే పనులు పూర్తి చేయించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌రెడ్డి, స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారులు ఎమ్మెల్యేను కలసి జాబ్‌మేళా నిర్వహణ, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై చర్చించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎక్స్‌రే మెషిన్

ఎమ్మెల్యే చొరవతో ఐదేళ్ల తరువాత అందుబాటులోకి



ప్రభుత్వాస్పత్రిలో ఉన్న అధునాతన ఎక్స్ రే మెషిన్

సూళ్లూరుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో గత ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ఎక్స్ రే మెషిన్ ఎట్టకేలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన ప్రభుత్వాస్పత్రికి 2020లో స్వర్ణ టోల్‌ప్లాజా యాజమాన్యం కార్పొరేట్ బాధ్యత కింద అధునాతన ఎక్స్ రే మెషిన్ అందజేసింది. అయితే ఆస్పత్రిలో ఉన్న ఎక్స్ రే మెషిన్ గదితో పాటు పలు విభాగాలకు విద్యుత్ సరఫరా లేకపోవడం వినియోగంలో లేదు. దీనిని గుర్తించి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) సభ్యులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి ఎంస్ అగర్వాల్, సీసీఎల్ పరిశ్రమల సహకారంలో రూ.3.50 లక్షలతో విద్యుత్ వైరింగ్‌తో పాటు ఎక్స్ రే మెషిన్ గదిని ఆధునీకీకరించి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈనెల 22న ఎక్స్‌రే మెషిన్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి అధికారుల తెలిపారు.

అందరికీ సమ న్యాయం



దుకాణదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ దుకాణాల వేలం పాటలకు సంబంధించి ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో ఏ ఒక్కరికీ రాయితీ ఉండదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. పంచాయతీకి చెందిన పలు దుకాణాలను వేలంపాటు నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో టీడీపీ నాయకుడు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి నివాసంలో శనివారం రాత్రి దుకాణదారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా పంచాయతీ దుకాణాలను నడుపుకుంటున్నామని, ఈ సారి వేలంపాటలు నిర్వహించకుండా తమకే దుకాణాలు అప్పగించి ఆదుకోవాలని ప్రస్తుత దుకాణాదారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అందరికీ సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఎలాంటి అపోహలకు తావు ఇవ్వొద్దన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, జలీల్‌అహ్మద్, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, సురేష్, మోహన్‌రెడ్డి, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు దొంగల అరెస్టు

బంగారు నగలు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం



మీడియాతో మాట్లాడుతున్న క్రైం అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల బ్యాగుల నుంచి బంగారు నగలు, నగదు చోరీ చేసే ఐదుగురు దొంగలను తిరుపతి క్రైం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నగలు, మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా బండ్లవీధికి చెందిన కందన్‌సాయి, కొండరాజుపల్లికి చెందిన కొండరాజు రత్తయ్య కొంత కాలంగా వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లు దొంగలించి విక్రయించేవారు. వీరితో పాటు ఎస్. జ్యోతి, వి.నందిని, ఏ. ప్రియ ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల బ్యాగులు చోరీచేసేవారు. వీరిపై విశాఖపట్నం, మల్కాపురం, కోడూరు, అలిపిరి, తమిళనాడు, సోమల, తిరుపతి, పుత్తూరు, గాజులమండ్యం, పాకాల, కార్వేటినగరం, కడప, నెల్లూరు జిల్లాల్లో కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో జయశ్యామ్ థియేటర్ వద్ద ముగ్గురు మహిళా నిందితులను, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండులో మోటారు సైకిల్ దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు కేసులకు సంబంధించిన సొత్తులు రికవరీ చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సీఐలు, ఎస్ఐలను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్‌బాబు

నాయుడుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకతో కాలుష్యాన్ని నివారించవచ్చని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.2.60 లక్షల జరిమానా

నాయుడుపేట టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 26 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారందరినీ శనివారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షిసుందరి తీర్పు ఇచ్చినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా నియోజకవర్గ పరిధిలోని పేదలందరికీ వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి చెక్కులను అందజేస్తూ చేయూతనందిస్తున్నామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 55మందికి రూ.35.97 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పేదలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే వారికి మెరుగైన వైద్యం చేయించుకునేందుకు వీలుగా సీఎం సహాయనిధి నుంచి చెక్కులను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గూడూరు నియోజకవర్గంలో సీఎం సహాయనిధి నుంచి రూ.2.75 కోట్లు చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న యూరియా కార్డులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, మట్టం శ్రావణి, పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, గణపర్తి కిషోర్ నాయుడు, మధుసూదన్‌రెడ్డి, పెంచలయ్య, నరసింహులు, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోపూరులో పుంగనూరువాసి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో, పోలీసులు

డక్కిలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం మోపూరు శివారు ప్రాంతంలో పుంగనూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... పుంగనూరుకు చెందిన రమేష్(45) ఏడేళ్లుగా మోపూరు క్రాస్ రోడ్డులో వడ్రంగి పనులు చేసుకొంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం మోపూరు శివారు ప్రాంతంలో మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి వీఆర్వో కోటిరెడ్డికి తెలియజేశారు. ఆయన ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువులకు తెలియజేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన సదస్సులో రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో శనివారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన కిమ్స్ హస్పిటల్ సహకారంతో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సాయిరూపా మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే సులభంగా నయం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, నవీన్ జయకుమార్, ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఈశ్వరయ్య మృతి



ఈశ్వరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సంచి కృష్ణయ్య, టీడీపీ నాయకులు

పెళ్లకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగాబత్తిన రామకృష్ణ సోదరుడు ఈశ్వరయ్య(78) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు సుందరరామిరెడ్డి, గంగాబత్తిన శ్రీనివాసులు, సన్నాడి వేణురెడ్డి తదితరులు నివాళులర్పించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఆర్టీవో అధికారులు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై గూడూరు ఆర్టీవో వినీల్‌రెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో పట్టణంలోని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులు మార్చడంతో వాహనాల ధరలు భారీగా తగ్గాయని చెప్పారు. అలాగే నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌సీఆర్ కల్యాణ మండపం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగాయి. శనివారం కల్యాణ మండపం వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ బకెట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో మంటలు రేగాయి. స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఏలాంటి ప్రమాదం జరగలేదు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

తడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. అలాగే ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మరోసారి మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడుతుందన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

వెంకటగిరిలో ఎడతెరపిలేని వర్షం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. చెరువులు, వాగులతో పాటు పట్టణంలోని కౌవల్యా నదిలోకి నీరు చేరింది.

వారికి ప్రతి ఏడాది దీపావళి ముందే వచ్చేస్తుంది.
మాటలు టపాసుల్లా పేలుతాయి. నవ్వులు మతాబుల్లా విరుస్తాయి.
చిరు చిరు జ్ఞాపకాలు చిచ్చుబుడ్లలా వెలుగుతాయి..
ఇక గిల్లికజ్జాలు... ఆటలు... పాటలు.. మాటలు... వీటికి కొదవే ఉండదు.
అందరూ చిన్నపిల్లలైపోతారు. ఆ కాసేపు... మెగాస్టార్, సూపర్‌స్టార్,
మామూలు స్టార్... ఇలాంటి భేదాలేవీ ఉండవు. ఇదంతా ఎక్కడంటారా?
'80' రీ-యూనియన్‌లో! ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారీ... రీ-యూనియన్
జరిగింది. ఆ ముచ్చట్లను అలనాటి హీరోయిన్లు సుహాసిని, లిజి, కుష్బూ,
పూర్ణిమా భాగ్యరాజా - 'నవ్య' కోసం ప్రత్యేకంగా పంచుకున్నారు..

స్టార్స్ ధమాకా!


కుష్బూ


సుహాసిని

అందరికీ ఒకే డ్రస్‌కోడ్ ఉంటుందా?

లిజి: దీని వెనక చాలా ప్లానింగ్ ఉంటుంది. రీ-యూనియన్ పార్టీలోనే- వచ్చేసారి ఎక్కడ నిర్వహించాలి? థీమ్ ఏమిటి? డ్రస్ కోడ్ ఏమిటనే విషయాన్ని నిర్ణయించుకుంటాం. ఆ తర్వాత ఎవరి డిజైనర్‌తో వాళ్లు డిజైన్ చేయించుకుంటారు. పార్టీకి వచ్చే వారు డ్రస్‌కోడ్‌ను పాటించాలి. డ్రస్ కోడ్‌తో పాటుగా రకరకాల ఆటలు ఉంటాయి. పెర్ఫార్మెన్స్‌లు ఉంటాయి.

సుహాసిని: సరదాగా ఇబ్బంది పెట్టే గేమ్స్ ఉంటాయి. అందరూ వాటిని ఆడాల్సిందే! ఉదాహరణకు సిల్క్‌స్మితలా డ్యాన్స్ చేయాలి అంటే - ఎంత పెద్ద సూపర్‌స్టార్ అయినా అలా డ్యాన్స్ చేయాల్సిందే! అందరం ఫ్రెండ్సే కదా... ఎలాంటి తారతమ్యాలు ఉండవు.

80 రీ-యూనియన్ ఎలా మొదలయింది?

లిజి: నేను ఒక ఫంక్షన్‌లో సుమలత, మోహన్‌లను కలిశాను. నేను, మోహన్ ఒకే ఊళ్లో (చెన్నైలో) ఉంటాం. కానీ ఎప్పుడూ కలవం. వాళ్లను కలిసినప్పుడు నాకు చాలా హ్యాపీగా అనిపించింది. 'చెన్నైలో ఉన్నవాళ్లందరం ఒకసారి కలిస్తే...' అనే ఆలోచన వచ్చింది. హాసిని (సుహాసిని)కి చెప్పాను. "చెన్నై నుంచే ఎందుకు? మిగిలిన ఊళ్ల నుంచి కూడా పిలుద్దాం" అంది. 'వాళ్లు వస్తారా?'అని నాకు అనుమానం వచ్చింది. బెంగళూరు, హైదరాబాద్, త్రివేండ్రం... ఇలా అన్ని ప్రాంతాల్లో ఉన్న వారిని పిలిచాం. వాళ్ల స్పందన చూసి మేము చాలా ఆశ్చర్యపోయాం. ఆలోచన నాదే అయినా... హాసిని అందరినీ ఒక చోట కలపగలిగింది. ఈ కథ అలా మొదలయింది.

కుష్బూ: నేను 80ల చివర్లో సినీ రంగానికి వచ్చాను. అందుకని నన్ను మొదటి సంవత్సరం పార్టీకి పిలవలేదు. రీ-యూనియన్ జరుగుతోందని తెలిసిన తర్వాత నేనే గేట్ క్రాష్ చేసి వచ్చేశా!

పూర్ణిమ: మొదటి కొన్నేళ్లు మా ఆయన (భాగ్యరాజా) రాలేదు. సాధారణంగా ఆయన ఎవరినీ కలవటానికి ఇష్టపడరు. "నేను డైరక్టర్‌ని కదా... మీ అందరూ యాక్టర్స్" అనేవారు. కొన్నేళ్ల తర్వాత ఒకసారి వచ్చారు. ఆ తర్వాత ప్రతి ఏడాది 'రీ-యూనియన్ ఎప్పుడొస్తుందా?' అని ఎదురుచూస్తూ ఉంటారు.


లిజి


పూర్ణిమా భాగ్యరాజా

అందరినీ పిలుస్తారా? కొందరికే ఎంట్రీ ఉంటుందా?

సుహాసిని: అందుబాటులో ఉన్నవారందరినీ పిలుస్తాం. బాలీవుడ్ హీరో, హీరోయిన్లను కూడా పిలుస్తాం. 'రా వన్' సినిమా విడుదల సమయంలో షారుక్‌ఖాన్ చెన్నైకి వచ్చారు. తనకు ఏదో సాయం అవసరమయింది. నాకు ఫోన్ చేశారు. '80 రీ-యూనియన్ పనుల్లో బిజీగా ఉన్నా... ఎల్లుండి ఫోన్ చేస్తా" అన్నా. షారూక్- " నన్ను కూడా పిలవచ్చు కదా" అన్నారు. "మీరు 90లలో సినిమా ఇండస్ట్రీకి వచ్చారు కదా..." అన్నా. "కాదు, కాదు... నేను నటించటం మొదలుపెట్టింది 80లలోనే..." అన్నారు. ఆ రీ-యూనియన్‌కి ఆయన కూడా వచ్చారు. ఆమిర్‌ఖాన్ తాను కూడా వస్తానని ఫోన్ చేశారు. పద్మినీ కొల్హాపూరి, మీనాక్షీ శేషాద్రి, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్... ఇలా కొందరు రీ-యూనియన్‌కు వచ్చారు. మరి కొందరు మిస్ అవుతూ ఉండచ్చు. ఎవరిని పిలవాలనే విషయం హోస్ట్‌పై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు హైదరాబాద్‌లో దీన్ని హోస్ట్ చేస్తున్నారనుకుందాం. ఎవరైతే హోస్ట్ చేస్తున్నారో... వారు తమ ఫ్రెండ్స్‌ను పిలవచ్చు. ఆ తర్వాత ఏడాది హోస్ట్ వాళ్లను పిలవకపోవచ్చు. అది వారిష్టం.

రీ-యూనియన్ పూర్తయిన తర్వాత ఎలా అనిపిస్తుంది?

పూర్ణిమ: 10 రోజులు వెల్‌నెస్ సెంటర్‌లో రిఫ్రెష్ అయి వచ్చినట్లుంది. ఆ ఆనందం బయట వాళ్లకు కూడా కనిపిస్తుంది.

లిజి: ఒక విధమైన హ్యాంగోవర్‌లో ఉంటాను. నా మిగిలిన స్నేహితులు "వచ్చేసారి థీమ్ ఏమిటి?" అని అడుగుతూ ఉంటారు.

సుహాసిని: రీ-యూనియన్ పూర్తయిపోయి ఇంటికి వెళ్తున్న సమయంలో ఒక విధమైన సంతృప్తి కలుగుతుంది. సంతోషంగా అనిపిస్తుంది. అదే సమయంలో మనసులో అందరినీ వదిలి వెళ్తున్నాననే బాధ కూడా కలుగుతుంది. 'అందరం ఒకే చోట ఉండిపోతే బావుంటుంది కదా!' అనిపిస్తుంది. ఈసారి శోభనకు త్రివేండ్రంలో ఒక ప్రోగ్రాం ఉంది. అది పూర్తి చేసుకొని 11 గంటల విమానం ఎక్కి, పార్టీకి 12.45కి వచ్చింది. మేమందరం ఉదయం 3.45 దాకా కలిసే ఉన్నాం. అయినా ఎవరూ కదలలేదు.

ఎవరు ఏం చేయాలనే విషయాన్ని ఎవరు నిర్ణయిస్తారు?

సుహాసిని: ఎవరు ఏ పెర్ఫార్మెన్స్ చేయాలనే విషయాన్ని డిజైన్ చేసేది నేనే! ఈసారి రీ-యూనియన్‌లో నదియా, నేను, కుష్బూ, జయశ్రీ చేసిన డ్యాన్స్ క్లిప్స్ బయటకు వచ్చాయి. ఇదంతా కేవలం పదిశాతం మాత్రమే! సాధారణంగా ఈ క్లిప్స్‌ను ఎప్పుడూ బయటకు వదలం- ఎందుకంటే అందరం ఫ్రెండ్స్ కదా! ఈ డ్యాన్స్‌ను నదియా కంపోజ్ చేసింది. మేమందరం ఎలాంటి రిహార్సల్స్ లేకుండా ఆమెతో స్టెప్స్ వేసామంతే! ఇక్కడ మీకో విషయం చెప్పాలి. నేను మంచి డ్యాన్సర్‌ను కాను. ఎప్పుడూ మిగిలిన పనుల్లో బిజీగా ఉంటా... అయినా మొదటి వరసలో నేనుంటా! ఎందుకంటే నేనే డిజైన్ చేస్తాను కాబట్టి స్టెప్స్ నాకు బాగా గుర్తుంటాయి. ఇక 'మిడ్లీ' (అన్ని పాటల కదంబం)ల కోసం మేము రిహార్సల్స్ చేస్తాం. మాకు అదొక పిక్నిక్‌లా అనిపిస్తుంది. మొదట అందరూ "మాకు ఆ స్టెప్ రాదు... మేము ఆ స్టెప్ వేయలేం"... ఇలా రకరకాల కారణాలు చెబుతారు. కానీ చివరకు అందరూ కలిసే డ్యాన్స్ చేస్తాం. ఒకసారి శోభన ఒక డ్యాన్స్ కంపోజ్ చేసింది. నేను, అర్జున్, శోభన- ముగ్గురం దానిలో ఉన్నాం. ఆ డ్యాన్స్ అంతా ఏక్రోబాటిక్స్‌లా ఉంటుంది. దాన్ని నేను ఎప్పుడూ మర్చిపోలేను. 2011లో అంబరీష్, సుమలత ఒక ప్రొఫెషినల్ కొరియోగ్రాఫర్‌ను పెట్టుకొని... 'రియల్ నుంచి డిజిటల్ వరకు' అని ఒక డ్యాన్స్ చేశారు. దాన్ని కూడా మరచిపోలేను.

> ఇప్పటి దాకా జరిగిన వాటిలో... చిరంజీవిగారి ఇంట్లో జరిగిన రీ-యూనియన్ చాలా స్పెషల్. అందరం చాలా ఎంజాయ్ చేశాం. అది ఇప్పటికీ మా అందరికీ గుర్తుంది.. (సుహాసిని, కుష్బూ, లిజి, పూర్ణిమ)

అందరిలోను బాగా చలాకీగా.. చిలిపిగా ఉండేదెవరు?

కుష్బూ: మొత్తం అందరిలోను చిలిపి జయరాం!

సుహాసిని: నా ఉద్దేశంలో కుష్బూనే చిలిపి. బయట పెద్ద నటి కావచ్చు, రాజకీయ నాయకురాలు కావచ్చు. కానీ రీ-యూనియన్‌లో మాత్రం ఆ పొరలన్నీ తొలగిపోతాయి..

పూర్ణిమ: నా ఉద్దేశంలో సుహాసినే అందరి కన్నా చలాకీగా ఉంటుంది. అందరితోనూ కలిసిపోతుంది. నవ్వుతూ ఉంటుంది. నవ్విస్తూ ఉంటుంది.

మీ అందరూ ఒకప్పటి పోటీదారులే కదా.. ఇప్పుడెలా స్నేహితులైపోయారు?

పూర్ణిమ: ఆ రోజులు దాటిపోయాయి. ఇప్పుడు మేమందరం ఫ్రెండ్స్! ఆ ఒక్క విషయాన్ని మాత్రమే గుర్తుపెట్టుకుంటాం. ఇక నా విషయానికి వస్తే- పెళ్లి అయిన తర్వాత నేను నటించటం మానేశాను. గృహిణిగా స్థిరపడ్డాను. అలాంటి సమయంలో మేమందరం రీ-యూనియన్ కోసం కలవటం మరపురాని విషయం.

సుహాసిని: ఒకప్పుడు మేము మిస్ అయిన వాటిని గుర్తు తెచ్చుకుని నవ్వుకుంటాం కూడా! ఉదాహరణకు భాగ్యరాజా తీసిన 'డార్లింగ్.. డార్లింగ్..డార్లింగ్'లో హీరోయిన్‌గా నేను నటించాలి. కానీ డేట్స్ లేకపోవటంతో పూర్ణిమ నటించింది. ఆమెకు భాగ్యరాజాతో పరిచయం అక్కడే! "నావల్లే నీకు భాగ్యరాజా దొరికాడు" అంటూ ఉంటా!

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఒకే దారి... ఒకే సారి!

**ఎంతో ఇష్టపడి న్యాయవాద డిగ్రీని అందుకున్నా...
కుటుంబ బాధ్యతల కారణంగా
ప్రాక్టీస్‌కు దూరమైన తల్లి...
తల్లి స్ఫూర్తితో 'లా' చదివి, అమ్మ చదువును
సార్థకం చేయాలని తపించిన కుమార్తె...
వారిద్దరూ ఇటీవల ఒకేసారి ఏపీ బార్ కౌన్సిల్‌లో
న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకున్నారు.
పేదలకు న్యాయం జరిగేలా చూడాలన్నదే తమ
ఆశయం అంటున్నారు...
కాకినాడకు చెందిన మెహెరాణి, లక్ష్మీ ఐశ్వర్య.**

మెహెరాణికి చదువంటే ఎంతో ఇష్టం. తన అన్నయ్యలా న్యాయవిద్య అభ్యసించాలని ఆమె కోరిక. అయితే... ఆమె బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే ఉండగానే... పోలీస్ శాఖలో ఎస్‌ఐ అయిన గాజుల వీరవెంకట సత్యనారాయణతో వివాహం అయింది. చదువు కొనసాగించాలనే మెహెరాణి తపనను గుర్తించిన భర్త... ఆ దిశగా ఆమెను ప్రోత్సహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసిన మెహెరాణి... రాజీవ్ గాంధీ లా డిగ్రీ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరి తన కలను నెరవేర్చుకున్నారు. 2015లో తను కోరుకున్న న్యాయవాద డిగ్రీని అందుకున్నారు. అయితే... భర్త ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాలకు తిరగడం వల్ల ఎక్కడా ప్రాక్టీస్ చేసే అవకాశం ఆమెకు లభించలేదు. మెహెరాణి, సత్యనారాయణ దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు మెహెర్... బిట్స్-పిలానీలో ఇంజినీరింగ్, యూఎస్‌లో ఎంఎస్ చేశారు. విదేశాల్లో డేటా సైంటిస్టుగా స్థిరపడ్డారు. కుమార్తె లక్ష్మీ ఐశ్వర్య మాత్రం తల్లిలా న్యాయ విద్యను అభ్యసించాలనుకున్నారు. హ్యూమానిటీస్ గ్రూప్‌తో ఇంటర్ పూర్తి చేశాక... 2020లో ఒడిశాలోని నేషనల్ లా యూనివర్సిటీలో... అయిదేళ్ల బీబీఏ- ఎల్ఎల్‌బీ (ఆనర్స్) కోర్సులో చేరి.. ఐదేళ్ల విద్యను అభ్యసించారు.



అమ్మ గురించి ఆలోచించి...

"ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో... బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకోవాలనుకున్నప్పుడు... అమ్మ గురించే ఆలోచించాను. తను ఎంతో ఇష్టంగా 'లా' చదివి, ఖాళీగా ఉండడం నాకు నచ్చలేదు. అమ్మ చదువుకు సార్థకత ఉండాలనుకున్నాను. అందుకే అమ్మకు నచ్చజెప్పాను. ప్రస్తుతం విజయవాడ ఏసీబీ విభాగంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మా నాన్న మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించారు" అని చెప్పారు లక్ష్మీ ఐశ్వర్య. "నా తల్లిదండ్రులు మల్లిపూడి బాబామెహర్ ప్రసాద్, శ్యామల, భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 'లా' చదివాను. కుటుంబ బాధ్యతలను, చదువును సమన్వయం చేసుకోవడం మొదట్లో కష్టంగా ఉండేది. న్యాయవాద కోర్సు పూర్తిచేసి, పట్టా అందుకున్నా... ప్రాక్టీస్ చేయడం సాధ్యపడలేదు. ఇప్పుడు మా అమ్మాయి కోరిక మేరకు ప్రాక్టీస్‌కు సిద్ధమయ్యాను. ఇటీవల బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా ఒకే రోజు మా పేర్లు నమోదు చేసుకున్నాం. న్యాయం కోసం వచ్చే పేదలకు సాయపడాలనేదే మా ఆశయం" అంటున్నారు మెహెరాణి. ఐఏఎస్ కావాలి. సమాజానికి సేవ చెయ్యాలి. ఇదే నా లక్ష్యం" అంటున్న లక్ష్మీ ఐశ్వర్య... ప్రస్తుతం హైదరాబాద్‌లోని నల్సార్‌లో ఎల్ఎల్ఎం చేస్తున్నారు.



• పీవీవీ వరప్రసాద్, కాకినాడ

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఓజీ	తెలుగు చిత్రం	అక్టోబర్ 23
అమెజాన్ ప్రైమ్		
హోస్ట్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 22
జియో హాట్‌స్టార్		
పిచ్ టూ గెట్ రిచ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 20
భద్రకాళి	తెలుగు చిత్రం	అక్టోబర్ 24
మనోరమా మ్యాక్స్		
స్టేషన్ 5	మలయాళ చిత్రం	అక్టోబర్ 18

బడ్జెట్ దీపావళి

పండగ కచ్చితంగా ఖర్చుతో కూడుకున్న వేడుకే! అలాగని సంబరాలు చేసుకోవడం మానుకోలేం కాబట్టి, వీలైనంత చవకగా దీపావళి పండగ జరుపుకొనే మార్గాల కోసం అన్వేషించాలి. అలాంటి మార్గాల్లో ఇవి కొన్ని..



క్యాండిల్స్ బదులుగా దివ్వెలు!: బల్బులు, క్యాండిల్స్‌తో దీపావళి వెలుగులు విరజిమ్మాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. కాబట్టి ఈ దీపావళినాడు మట్టి ప్రమిదలు సేకరించి, వాటి మీద ఆక్రిలిక్ కలర్స్‌తో డిజైన్లు గీయండి. వీటిలో నూనె లేదా మైనం నింపి వెలిగించండి. మట్టి ప్రమిదలు క్యాండిల్స్ కంటే ఎక్కువ సమయంపాటు వెలుగుతాయి.

పువ్వుల రంగోలి: రసాయనాలతో తయారైన కృత్రిమ రంగులకు బదులు పూల రేకులు, పసుపు, బియ్యం పిండిలతో రంగోలి తయారుచేయండి. వీటి ఖరీదు తక్కువ. పైగా అలంకరణ కూడా తేలికే! ఇంటి వాకిలి లేదా హాల్‌ను పూల రంగోలీలతో నింపేస్తే ఇంట్లో పండుగ శోభ వెల్లివిరుస్తుంది.

వెలుగులు విరజిమ్మేలా: వాడకుండా వదిలేసిన సీసాలను సేకరించి వాటికి రంగులేయండి. వాటి లోపల ఫెర్రీ లైట్లను నింపి, కిటికీల దగ్గర ఉంచి ఆన్ చేయండి. రంగు కాగితాలతో పూలను తయారుచేసి, సీసాల్లో నింపినా బాగుంటుంది. సీసాల్లో గోళీలు, గులకరాళ్లు నింపి, ఫెర్రీ లైట్లను కూడా అలంకరించుకోవచ్చు.

దుపట్టాతో డెకరేషన్: గది సీలింగ్ నుంచి మూలలకు రంగురంగుల దుపట్టా లేదా చీరలతో అలంకరించుకోవచ్చు. కిటికీలకు, తలుపుల దగ్గర కర్టెన్లుగానూ వాడవచ్చు. బెడ్ వెనకాల గోడకు డిజైన్‌లా దుపట్టాలను అలంకరించి, వాటి మీద అక్కడక్కడా పువ్వులను గుచ్చండి. గదికి పండగ శోభ వస్తుంది.

దాండియా!: డిజె లేదని దిగాలు పడవలసిన అవసరం లేదు. స్నేహితులను పోగు చేసి దాండియా ఆడుకోవచ్చు. వినసొంపైన పాటల లిస్ట్ తయారుచేసుకుని దీపావళి రాత్రి దాండియాతో హంగామా చేయవచ్చు. ఇందుకోసం దాండియా స్టిక్స్, మిలమిలమెరిసే దాండియా దుస్తులు ఉంటే చాలు.

భలే బహుమతులు!: ప్రమిదలకు ఆకర్షణీయమైన రంగులతో పెయింట్ చేసి స్నేహితులకు ఇవ్వవచ్చు. మైనం కొని క్యాండిల్స్ తయారుచేసి బహుకరించవచ్చు. స్వీట్లు తయారుచేసే సామర్థ్యం ఉంటే వాటిని అందంగా గిఫ్ట్ ప్యాక్ చేసి స్నేహితులు, బంధువులకు బహుకరించవచ్చు.

దీప కాంతుల ధగధగలు

దీపావళి పండుగ రోజున ఇల్లంతా దీపాలతో అలంకరించుకుంటూ ఉంటాం. పూజ సమయంలో మట్టి ప్రమిదల్లో నువ్వుల నూనె లేదా ఆవు నెయ్యితోపాటు ఒత్తులు వేసి వెలిగిస్తాం. ఇంటిని అలంకరించడానికి కొవ్వొత్తులు, మైనం దీపాలు, ఎలక్ట్రిక్ దీపాలు, రంగురంగుల ఎల్ఈడీ లైట్లు ఉపయోగిస్తుంటాం. వీటితోపాటు ప్రస్తుతం రకరకాల దీపాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వాటిపై ఓ లుక్కేద్దామా..!



వేలాడే దీపాలు

దేవతా మూర్తుల విగ్రహాలు, నెమళ్లు, హంసలు, శంఖు చక్రాలు, కలశం రూపాలతో కూడిన దీపపు కుందులకు పొడవాటి చెయిన్, హుక్ అమరుస్తారు. పండుగ రోజున వీటిని పూజగదిలో, హాల్లో వేలాడదీసుకుని చక్కగా వెలిగించుకోవచ్చు. పండుగ తరువాత దీపం వెలిగించకపోయినా డెకరేషన్ ఐటెమ్స్‌గా నిలిచి ఉంటాయి. మట్టి, ఇత్తడి, పంచలోహాలతో రూపొందించిన రకరకాల వేలాడే దీపాలు అందుబాటులో ఉన్నాయి.



స్టాండ్ దీపాలు

దీపావళి రోజున ఇంట్లో, ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి పూలతో అలంకరించి సాయంత్రం కాగానే దీపాలు పెట్టుకుంటాం. ఇలా చేయడం కొంచెం శ్రమ అనుకునేవారికోసమే స్టాండ్ దీపాలు వచ్చేశాయి. పండుగ శోభ ఉట్టిపడేలా వివిధ ఆకారాల్లో ఇవి లభ్యమవుతున్నాయి. వీటిని తెచ్చుకుని ఇంట్లో అందంగా అమర్చుకుని దీపాలు వెలిగిస్తే చాలు. ఇంటికి ఎలాంటి అలంకరణ చేయనవసరం లేదు.




3డీ దీపాలు

దీపం వెలిగించగానే చుట్టూరా అందమైన ముగ్గు ప్రత్యక్షమవుతుంది. అయిదారు దీపాలను పూజగదిలో లేదా హాల్ మధ్యలో అందంగా అమర్చి వెలిగిస్తే చాలు చక్కని రంగవల్లి ఆవిష్కృతమవుతుంది. నూనెతో వెలిగించేవి, మైనంతో తయారుచేసినవి, నీళ్లు పోస్తే వెలిగేవి అందుబాటులో ఉన్నాయి. ఎల్ఈడీ బల్బులు, వాటర్ సెన్సర్ టెక్నాలజీలతో రూపొందించిన రంగురంగుల తామర పువ్వుల దీపాలను ఓ నీళ్ల కంచంలో ఉంచితే చాలు ఇల్లంతా పండుగ శోభతో మెరిసిపోతుంది.



మంత్ర దీపం

పండుగ రోజున మనసారా దేవుని స్మరించుకుంటూ దీపం వెలిగిస్తాం. వెంటనే దీప శ్లోకం లేదా గాయత్రీ మంత్రం చదువుకుంటూ ఉంటాం. అవి చదవడం రానివారి కోసమే ఈ మంత్ర దీపం అందుబాటులోకి వచ్చేసింది. ఇది ఎలక్ట్రిక్ దీపం. దీనికి చిన్న ఎల్ఈడీ బల్బు అమర్చి ఉంటుంది. దీపం వెనక ఉన్న మీట నొక్కగానే బల్బు దీపంలా వెలుగుతుంది. అంతేకాదు గాయత్రీ మంత్రం, ఓంకారం, పంచాక్షరీ మంత్రం ఇలా మనకు నచ్చిన చాంటింగ్ వినవచ్చు. ఈ దీపం రీఛార్జబుల్ కూడా.



నీళ్ల దీపాలు

పేరుతోనే అందరిలో ఉత్సుకత కలిగిస్తుంటాయి ఈ దీపాలు. ప్రమిదలో యానోడ్, క్యాథోడ్ అనే రెండు వైర్లతో పాటు బటన్ సెల్, సెన్సర్ అమరుస్తారు. ప్రమిదలో నీళ్లు పోయగానే సెన్సర్ ద్వారా వైర్ల మధ్య కరెంట్ ప్రవహిస్తుంది. దీంతో బల్బు వెలుగుతుంది. ఒక్కో బటన్ సెల్ సుమారు 50 గంటలపాటు బల్బుని వెలిగిస్తుంది. పువ్వులు, కొవ్వొత్తులు, కుందులు ఇలా రకరకాల ఆకారాల్లో నీటి దీపాలు లభ్యమవుతున్నాయి. పండుగ రోజునే కాదు చిన్న ఫంక్షన్లు, పూజలు, ఇతర వేడుకల సమయాల్లో; గృహాలంకరణకు కూడా ఈ నీటి దీపాలను వెలిగించుకోవచ్చు.